RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 11 ఫిబ్రవరి 2026 బుధవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:212

# పురపోరులో ఎగిరేది కాంగ్రెస్ జెండానే.

## -మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**స్టేట్ బ్యూరో ప్రజాబలం ప్రతినిధి:**

116మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో 80శాతం పైగా స్థానాల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధించబోతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ విసిరిన సవాళ్లను గత రెండెండ్లలో అన్ని ఎన్నికల్లో ప్రజలు తిప్పికొట్టారు.

రిఫరెండమనే నాయకులు సైలెంట్ అయ్యారు.

అందుకే ఇప్పుడు ఎక్కడ ఏ ప్రచారంలో రిఫరెండం, సెమీఫైనల్స్ అనడం లేదు.

కారణం ప్రతిపక్ష నేతలకు ఓటమి భయం పట్టుకుంది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతున్నందుకే ఏ ఎన్నికలు వచ్చినా ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదిస్తున్నారు.

ముఖ్యంగా ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందన్న అనుమానం ఉంది.

అందుకే ట్యాపింగ్ కోసం ఎక్కడెక్కడ పరికరాలు అమర్చారో ప్రభుత్వం ఆరా తీస్తోంది, ఫోన్ ట్యాపింగ్ పై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది, బాధ్యులపై చట్ట పరమైన కఠిన చర్యలు తప్పకుండా ఉంటాయి.

మాజీ మంత్రుల అసభ్య పదజాలానికి ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పడం ఖాయం.

నేను సీఎం రేసులో లేను, కాంగ్రెస్ పార్టీలో ఒక సామాన్య కార్యకర్తను.. ఇదే విషయాన్ని చాలా సార్లు చెప్పాను.మళ్ళీ చెబుతున్నాను.

జిల్లాల విభజన శాస్త్రీయంగా జరగలేదని ఆయా జిల్లాల ప్రజల నుంచి అనేక విజ్ఞాపనలు వచ్చాయి.

ప్రభుత్వం దానిపై ఒక కమిటి వేసి, నివేదికపై అసెంబ్లీలో చర్చ పెడుతాం. ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ గారు కూడా రావాలి.

కాంగ్రెస్ గ్రామీణ ప్రాంతాల్లోనే ఉంది.. అర్బన్ ప్రాంతాల్లో లేదనే ఊహల్లో ప్రత్యర్థి పార్టీలున్నాయి. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత వారికి తెలుస్తది.

గత ఉప ఎన్నికలు, పంచాయితీ ఎన్నికల్లో మాదిరిగానే మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ కే ప్రజలు పట్టం కడతారనే పూర్తి విశ్వాసం ఉంది.



**జూబ్లీహిల్స్ (ప్రజాబలం ప్రతినిధి )**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి మహా శివరాత్రి జాతర మహోత్సవానికి ఆహ్వానించిన మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు.



**జూబ్లీహిల్స్ (ప్రజాబలం ప్రతినిధి )**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి "కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు-2026" ఆహ్వానం అందజేసిన మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఈవో సుధాకర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేష్, ఆలయ అర్చకులు.

# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వార్తా 2 లో



రాష్ట్రంలోని 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీజీపీ బి.శివధర్ రెడ్డి IPS తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం 3 వేల మంది అదనపు బలగాలను రంగంలోకి దించామని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని డీజీపీ సూచించారు.

# చెరువుల అభివృద్ధిలో హైడ్రా భేష్.

## -- ఉప్పల్ నల్లచెరువును పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు.





**ఉప్పల్ ప్రజాబలం ప్రతినిధి:** పర్యావరణ హితమైన నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యానికి హైడ్రా చేస్తున్న కృషి అభినందనీయమని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణలో హైడ్రా చొరవను కొనియాడారు. మరీ ముఖ్యంగా నగరంలో చెరువుల అభివృద్ధికి హైడ్రా ఎంతో కృషి చేస్తోందన్నారు. చెరువుతో పాటు.. ఆ పరిసర ప్రాంతాల రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. వరద నివారణతో పాటు.. పర్యావరణ పరిరక్షణకు, జీవవైవిధ్యానికి, భూగర్భ జలాల పరిరక్షణకు చెరువుల ప్రాధాన్యతను గుర్తించే వాటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. ఉప్పల్‌లోని ఎస్ ఎన్ డీ పీ ప్రాజెక్టు పనులు ప్రారంభోత్సవానికి మంగళవారం వచ్చిన మంత్రి శ్రీధర్ బాబుఉప్పల్ నల్ల చెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీ లక్ష్మారెడ్డితో పాటు.. ఎమ్మెల్సీ శ్రీ పి. మహేందర్ రెడ్డితో కలిసి ఐటీ మంత్రి ఉప్పల్ నల్లచెరువును సందర్శించారు. ఈ సందర్భంగా చెరువును ఎలా అభివృద్ధి చేస్తున్నారు.. ఏలా తీర్చిదిద్దుతున్నారు అనే విషయాలను అక్కడ చెరువు పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్స్ సంస్థ యజమాని మహమ్మద్ యూనస్‌ను అడిగి తెలుసుకున్నారు. చెరువు అభివృద్ధి పనులకు సంబంధించిన 3డీ నమూనాలను మంత్రి పరిశీలించారు.

**ఫ్రంట్ ఎలివేషన్ బాగుండాలి..**

ఉప్పల్ నల్లచెరువు ఫ్రంట్ ఎలివేషన్ బాగుండాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. వరంగల్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఈ చెరువుంది.. దాదాపు కిలోమీటరు పొడవునా చెరువు విస్తరించి ఉంది. రోడ్డు పొడవునా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. చెరువు చుట్టూ 2 కిలోమీటర్లకు పైగా వాకింగ్ ట్రాక్ వస్తుందని.., చిన్న పిల్లలు ఆడుకునే ప్లే ఏరియా, చెరువు చుట్టూ సీటింగ్ సౌకర్యం, పచ్చిక బైళ్లు, పార్కులు, అన్ని వయసులవారికి వ్యాయాయ పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయని అక్కడ పనులు చేపడుతున్న వారు మంత్రికి తెలిపారు. మురుగు నీరు కలవకుండాడైవర్ట్ కాలువలు నిర్మిస్తున్నామని చెప్పారు. ఆక్రమణలతో55ఎకరాలకు కుంచిం చుకు పోయిన చెరువును 69 ఎకరాలకు విస్తరించామని.. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు ఇప్పటికే పలుమార్లు ఇక్కడికి వచ్చి పనులను పర్యవేక్షించారన్నారు. ఆక్రమణల తొలగింపు విషయంలో హైడ్రా అధికారుల చొరవ చెరువు విస్తరణకు దోహద పడిందని తెలిపారు. చెరువులో3మీటర్ల మేర పూడికను తొలగించామని. ప్రధాన ద్వారం చెరువుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు.

# నగర ప్రజలకు మేయర్ కృతజ్ఞతలు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ఐదేండ్లు హైదరాబాద్ మహానగరపాలక సంస్థ మేయర్ గా బాధ్యతలు నిర్వర్తించేందుకు అవకాశం ఇచ్చిన నగర ప్రజలకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మేయర్ గా నగరాభివృద్ధికి శాయశక్తుల కృషి చేశానని ఆమె తెలిపారు.

**సీఎం కు ప్రత్యేక ధన్యవాదాలు**

నగరాభివృద్ధికి తోడ్పాటు అందించిన సీఎం రేవంత్ రెడ్డి గారికి, మంత్రులు పొన్నం ప్రభాకర్ గారికి, శ్రీధర్ బాబు గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మేయర్ గా తన పదవీ కాలంలో సహకారం అందించిన కార్పోరేటర్ లు , ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి

కౌన్సిల్ సభ్యులకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాబలం

11 ఫిబ్రవరి 2026 బుధవారం

## అందరి చూపు సుప్రీం వైపు

సర్ ప్రక్రియలో ఎలాంటి ఆటంకం కలిగించేందుకు అనుమతించబోమని, అన్ని రాష్ట్రాలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో అవసరమైతే ఆదేశాలు జారీ చేస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ అంశంపై దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ అధికారుల పేర్లు ఇవ్వాలని ఎన్నికల సంఘం రాష్ట్రాన్ని ఎప్పుడూ కోరలేదన్నారు. దీనికి సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ స్పందిస్తూ ప్రస్తుతం 8,500 మంది అధికారుల జాబితాను సమర్పించామని, దాన్ని కోర్టు స్వీకరించాలని కోరారు. దీనికి సీజేఐ స్పందిస్తూ ఆ జాబితాలో అధికారుల పేర్లు, హోదాలు, పనిచేసే ప్రాంతాల వివరాలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. వారిని ఎలా సంప్రదిస్తారు? మరుసటి రోజే సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల (ఈఆర్వో) వద్ద రిపోర్ట్ చేయగలరా? అంటూ ప్రశ్నించగా.. దానికి న్యాయవాది దివాన్ అవునని సమాధానం ఇచ్చారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సమీక్షలో భాగంగా పశ్చిమబెంగాల్ లోని ఓటర్ల జాబితాల్లోంచి వేలాది మంది ఓటర్లను అనర్హులుగా తొలగించారు. రాజ్యాంగ విరుద్ధంగా ఈ విధంగా తొలగించడం అన్యాయమని ధ్వజమెత్తుతూ దీనిపై తక్షణం జోక్యం చేసుకోవాలని కోరుతూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావడం సంచలనం కలిగించింది. నిజాయితీగా అర్హులైన ఓటర్లకు జాబితాలో చోటు లభించాలి. ఈమేరకు హామీ ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దే. ప్రత్యేక సమగ్ర సర్వే చేపట్టక ముందు పశ్చిమబెంగాల్ ఓటర్ల జాబితాలో 7.66 కోట్ల వరకు ఎంట్రీలు ఉండేవి. అందులోంచి 58 లక్షల పేర్లను తొలగించిన తరువాత ఎన్నికల కమిషన్ నమూనా జాబితాను ప్రకటించి 1.16 కోట్ల ఎంట్రీల్లో తార్కిక వైరుధ్యాలు ఉన్నాయని వెల్లడించింది. ఇది క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి చేసిన ఒక ప్రయత్నం లేదా నిర్ణయాన్ని సమర్థించుకోవడానికి ఉపయోగించే తప్పుడు సాకును తెలియజేస్తుందని చెప్పవచ్చు. ఈ పొంతనలేని అసంబద్ధమైన పదజాలాన్ని ఉపయోగించి ఎన్నికల సంఘం పశ్చిమబెంగాల్ ప్రజలను తమ పాలకులను ఎన్నుకునే హక్కు నుంచి దూరం చేయడమే అవుతుంది. ఓటు వేసే హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభంలా ఆచరణలో ఉంటోంది. భారత దేశం వివిధ భాషలు, మాండలికాలు కలిగిన బహుళ భాషా సమాజం ప్రపంచం లోనే అత్యధికంగా భాషా వైవిధ్యం కలిగిన దేశాల్లో ఒకటిగా భారత్ పరిగణించబడుతోంది. రాజ్యాంగం లోని 8వ షెడ్యూల్‌లో 22 భాషలకు గుర్తింపు కలిగినప్పటికీ దేశవ్యాప్తంగా వందలాది భాషలు వాడుకలో ఉన్నాయి. ఈ భాషల్లో సరైన నామవాచకాలు రాసేటప్పుడు తేడాలు, అనివార్యమైన తప్పులు చోటు చేసుకోవచ్చు. దీదీ వాదనలను న్యాయమూర్తులు జోయ్‌మల్యా బాగ్చి, వీఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. సీఎం ఆవేదనలో నిజం ఉందని, ప్రతీ సమస్యకూ పరిష్కారం ఉంటుందని హామీ ఇచ్చింది. అనంతరం మమతా బెనర్జీ పిటిషన్‌పై స్పందన కోరుతూ ఎన్నికల సంఘానికి ధర్మాసనం నోటీసు కూడా జారీ చేసింది.విచారణ సందర్భంగా.. ఈసీఐపై మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ప్రక్రియలో ఆధార్‌ను అంగీకరించకుండా కోర్టు ఆదేశాలను ఎన్నికల సంఘం ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు తమ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని మండిపడ్డారు. సర్ ఒత్తిడి కారణంగా 100 మందికిపైగా ప్రజలు మరణించారని దీదీ ఆరోపించారు. అనేక మంది ఆసుపత్రి పాలయ్యారన్నారు. ప్రజల హక్కులను కాపాడండి అంటూ దీదీ తన వాదనలను ముగించారు.పురుషులు, మహిళలు వయసులో తేడాలు, 15 ఏళ్ల కన్నా తక్కువ లేదా 50 ఏళ్ల వరకు తమ తల్లిదండ్రులకు తమకు తేడా ఉండవచ్చు. కొన్నిసార్లు దంపతులకు ఆరు లేదా అంతకన్నా ఎక్కువ సంతానం ఉండవచ్చు. చాలా మంది మహిళలు తమ పేరు చివరన తమ భర్త పేరు చేర్చుకుంటుంటారు. ఇవన్నీ భారత దేశ ప్రజాజీవనంలో వాస్తవాలే తప్ప ఓటర్ల జాబితాలో పేర్లను కొట్టేసినంత శక్తివంతమైన తార్కిక వ్యత్యాసాలు కావు. ఈ సమస్యలను సుప్రీం కోర్టే స్వయంగా ప్రస్తావించిందని గుర్తు చేసుకోవాలి. ఓటర్ల జాబితాల్లోంచి పేర్లను తొలగించడానికి వాటిని సాకుగా ఉపయోగించడంపై తన అసమ్మతిని వ్యక్తం చేసింది కూడా. ఈ అసంబద్ధ కారణాలను ఎన్నికల కమిషన్‌కు ఎత్తిచూపడానికి తన వాదనలు వినిపించగా వాటిని ఎన్నికల కమిషన్ తిరస్కరించిందని మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు.ఇక చేసేది లేక ఆమె నేరుగా సుప్రీం కోర్టు ముందు హాజరై తన వాదనలను వినిపించారు. దీనికి సుప్రీం కోర్టు స్వాగతించింది. ఈ గజిబిజి వ్యవహారంలో మరింత సున్నితంగా వ్యవహరించాలని ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కోర్టు సూచించింది. మమతా బెనర్జీ వాదించిన అంశాలు ఒక సమస్యకు ప్రాధాన్యం ఇవ్వాలని మనల్ని అడుగుతున్నాయి. వి మనదేశం ప్రజాస్వామ్యయుతంగా పనిచేయడానికి కీలకమైన అంశాలు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 ప్రకారం ఏ వ్యక్తి తన జీవితాన్ని లేదా వ్యక్తిగత స్వేచ్ఛను కోల్పోకూడదు. చట్టం ద్వారా నిర్దేశించిన ప్రక్రియ ద్వారా తప్ప మరెప్పుడూ అలా జరగకూడదు. ప్రతి పౌరుడికీ గౌరవంగా జీవించే ప్రాథమిక హక్కు ఉంటుంది. అదే విధంగా సర్వసత్తాక గణతంత్ర దేశంలో ప్రతి పౌరునికీ ఓటు వేసే ప్రాథమిక హక్కు ఉంటుంది. కాబట్టి దానిని జీవించే హక్కుతో సమానంగా పరిగణించాలి. ఓటరు జాబితా నుంచి ఎవరిని తొలగించినా చట్ట నిబంధనల ప్రకారం మొదట సరైన విధానాన్ని అవలంబించాలి. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్లు ఎవరినైనా అనర్హులని ప్రకటిచడం వెనుక పోల్ ప్యానెల్‌లో పనిచేసే అధికారుల ఇష్టాయిష్టాలు, అభిరుచులు మాత్రమే బలీయమైన కారణం కాకూడదు. భారతీయులు ప్రతివారూ ఓటు వేయాలి.ఎందుకంటే అది వారి ప్రాథమిక హక్కు. అంతే తప్ప ఎన్నికల కమిషన్ దయాభిక్ష కాదు. ఈ హక్కు ఒక సౌకర్యవంతమైన దృశ్యం కాదని వాదించడానికే పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీం కోర్టుకు వ్యక్తిగతంగా హాజరయ్యారు. బీహార్ తరువాత గత నవంబర్ 4 నుంచి 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)ను చేపట్టిన సంగతి తెలిసిందే. తమిళనాడు, పశ్చిమబెంగాల్, కేరళ రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో కూడా ఇది సాగుతోంది. ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఈ రెండో దశలో కూడా అనేక లోపాలు కనిపిస్తున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నా ఎన్నికల కమిషన్ పట్టించుకోవడం లేదు. ఓటర్ల జాబితా తయారీ అన్నది సమ్మిళిత ప్రక్రియగా ఉండాలి తప్ప ఓటర్లను మినహాయించేలా ఉండకూడదని సుప్రీం కోర్టు అనేక సార్లు సూచించినా ఆ సూచనలను సరిగ్గా పాటించడం లేదు. బీహార్‌లో చాలా ఎక్కువ సంఖ్యలో ఓటర్లు తమ హక్కును కోల్పోయే రిస్కును తెచ్చిపెట్టిందని విపక్షాలు, వివిధ వర్గాల ప్రజలు తీవ్రంగా ఆందోళన వెలిబుచ్చారు. బీహార్‌లో సాధారణ నివాసులను తొలగించలేదని, వలసవాదులను మాత్రమే టార్గెట్‌గా పెట్టుకున్నామని ఎన్నికల కమిషన్ నమ్మబలికింది. అయినా ఎక్కువ శాతం మహిళలే జాబితాల్లోంచి తొలగించబడ్డారు. ఈ క్రమ రాహిత్యాలు ఎన్నికల కమిషన్ విధానపరమైన చట్రంలో రూపొందినట్టు కనిపిస్తోంది. పశ్చిమబెంగాల్‌లో కూడా ఇదే కొనసాగడం ఆందోళన కలిగించే విషయం.

# తెలంగాణపై కేంద్రం ఆర్థిక వివక్ష

**- తెలంగాణకు నిధుల్లో కోత... ఇది ఫెడరలిజంపై దాడే...**
**- సొమ్ములు మావి... గొప్పలు మీవా.?**
**- ప్రతిసారి మేమిచ్చాం, మేము తెచ్చాం అని అంటున్నారు, అది తెలంగాణ ప్రజల సొమ్ము.**
**- తెలంగాణ కేంద్రానికి ఇచ్చేది 1,33,208 కోట్లు...**
**- కేంద్రం తిరిగి తెలంగాణకు ఇచ్చింది కేంద్ర పథకాలతో కలిపి కేవలం 51 వేల కోట్లు మాత్రమే.**
**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



దేశానికి అధికంగా ఆదాయం సమకూర్చుతున్న దక్షిణాది రాష్ట్రాలు నేటి కేంద్ర ఆర్థిక విధానాల వల్ల అన్యాయానికి గురవుతున్నాయని, ఇది కేవలం ఆర్థిక వివక్షే కాదు... రాజకీయ ఉద్దేశంతో కూడిన వివక్ష అని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు.

"వికసిత్ భారత్" అనే నినాదం ఇస్తూ దేశ అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం, దక్షిణాది రాష్ట్రాల పట్ల ముఖ్యంగా తెలంగాణ విషయంలో స్పష్టమైన వివక్ష, నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోందని అన్నారు.

**దేశ ఆదాయానికి దక్షిణాది వెన్నెముక...**

2018--19 నుంచి 2022--23 వరకు ఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన మొత్తం పన్నులు రూ.90.80 లక్షల కోట్లు అయితే, ఇందులో దక్షిణాది రాష్ట్రాల నుండే పావుభాగానికి పైగా రూ. 22.86 లక్షల కోట్లు వచ్చాయన్నారు. అయినప్పటికీ, ఈ స్థాయిలో ఆదాయం ఇచ్చిన దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం తిరిగి ఇచ్చిన నిధులు మాత్రం కేవలం 16.3 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. ఇది ఆర్థిక సమాఖ్య స్ఫూర్తికి పూర్తి విరుద్ధం అని మంత్రి వ్యాఖ్యానించారు.

పన్నులు చెల్లించిన ప్రతి రూపాయికి తిరిగి వచ్చే నిధులను పోల్చితే కేంద్రం పాటిస్తున్న ద్వంద్వ వైఖరి బయటపడుతుందని మంత్రి తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు రూపాయికి సగటున 30 పైసలు ఇస్తూ, ఇదే సమయంలో బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి ఉత్తరాది రాష్ట్రాలకు రూ.1కి రూ.4 చొప్పున ఇస్తున్నారని, ఇది ఆర్థిక అసమతుల్యతను పెంచడమే కాకుండా, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య విభేదాలను సృష్టించే ప్రమాదకర ధోరణి అని హెచ్చరించారు.

"ఎక్కువ పన్నులు చెల్లించే రాష్ట్రాలను శిక్షించడం, తక్కువ వసూళ్లు చేసే రాష్ట్రాలను ప్రోత్సహించడం కేంద్ర విధానంగా మారింది" అని మంత్రి ఆరోపించారు. కేంద్రం చెప్పుకునే వికసిత్ భారత్ విధానం అంటే ఇదేనా అని మంత్రి ప్రశ్నించారు.

**తెలంగాణ గణాంకాలే సాక్ష్యం....**

డిసెంబర్ లో జరిగిన పార్లమెంట్ సమావేశాలలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా 2024-25 లో తెలంగాణ రాష్ట్రం నుండి 1,33,208 కోట్ల పన్నులు వసూలు అయితే.. కేంద్రం నుండి రాష్ట్రానికి కేంద్ర పన్నుల రూపంలో 27,050 కోట్లు, కేంద్ర గ్రాంట్ల రూపంలో 7,913 కోట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాల రూపంలో 16,762 కోట్లు మొత్తంగా 51,725 కోట్లు విడుదల చేసినట్టు పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి సమాధానం చెప్పారని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. "పథకాల రూపంలో వచ్చిన నిధులను కూడా కలిపితేనే ఈ మొత్తం వస్తోంది. స్వేచ్ఛగా వినియోగించుకునే నిధులు మాత్రం మరింత తక్కువ" అని మంత్రి వివరించారు.

**జీఎస్టీతో మొదలైన దెబ్బ... గ్రాంట్ల కోతతో కొనసాగింపు...**

జీఎస్టీ సవరణల కారణంగా తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే ఏడాదికి సుమారు రూ.8 వేల కోట్లు నష్టపోతోందని మంత్రి తెలిపారు. ఇక 15వ ఆర్థిక సంఘం సూచించిన రెవెన్యూ లోటు గ్రాంట్లను 16వ ఆర్థిక సంఘం పూర్తిగా పక్కన పెట్టడంతో రాష్ట్రాల ఆర్థిక స్వాతంత్ర్యం దెబ్బతిన్నదని విమర్శించారు. రంగాలవారీగా, రాష్ట్రాల ప్రత్యేక గ్రాంట్లకు కత్తెర పెట్టడం వల్ల తెలంగాణకు మరో రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

**ఇది ఆర్థిక సమస్య కాదు... రాజకీయ నిర్ణయం...**

"ఇది కేవలం లెక్కల విషయం కాదు. ఇది కేంద్రంలో ఉన్న పాలకుల రాజకీయ ఆలోచనల ఫలితం. బలమైన రాష్ట్రాలను బలహీనపరచి, ఆర్థికంగా ఆధారపడేలా చేయాలనే ఉద్దేశమే కనిపిస్తోంది" అని తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలలో బిజెపి పార్టీ అస్థిత్వాన్ని నిలబెట్టుకోవాలనే ఉద్దేశ్యంతోనే దక్షిణాది రాష్ట్రాలకు ముఖ్యంగా తాము అధికారంలో లేని రాష్ట్రాలకు తక్కువ నిధులు విడుదల చేసి, వారి కుంచిత స్వభావాన్ని చూపెడుతున్నారని అన్నారు.

**ఫెడరల్ వ్యవస్థను కాపాడాల్సిన అవసరం...**

ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రాలు భాగస్వాములే కాని, కేంద్రం దయాధర్మాలపై ఆధారపడేవి కావని మంత్రిగారు స్పష్టం చేశారు. దేశ సమగ్ర అభివృద్ధి సాధించాలన్న, కేంద్రం చెప్పుకుంటున్న వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా, అన్ని రాష్ట్రాలకు సమన్యాయం జరగాలని, ముఖ్యంగా ఆదాయం సమకూర్చే రాష్ట్రాలపై వివక్ష మానుకోవాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని మంత్రి కోరారు.

"తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహించే బిజెపి ఎంపీలు మరియు కేంద్ర మంత్రులు కూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పదేళ్లలో ఏనాడు ప్రశ్నించకపోగా, రాష్ట్రానికి అన్ని తెచ్చాం, ఇన్ని చేశాం, రాష్ట్ర ఖజానాకు కేంద్రమే పూర్తి నిధులు సమకూరుస్తుందనట్లు మాట్లాడటం వారి పతనానికి నాంది. జాతీయ రహదారుల నిర్మాణాలను కూడా రాష్ట్రానికి విడుదల చేసే నిధుల ఖాతాలలో వేస్తున్న ఈ నాయకులు, వాటిని నిర్మించి మళ్లీ ప్రజల నుండే టోల్ చార్జీల రూపంలో వసూలు చేస్తున్న విషయాన్ని మరిచారా అని మంత్రి ప్రశ్నించారు.

ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతు భరోసా, పంట కొనుగోళు ,, సాగునీటి ప్రాజెక్టులు, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో భారీగా ఖర్చు చేస్తోందని, కానీ కేంద్రం నుంచి రావాల్సిన న్యాయమైన వాటా రాకపోవడం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి అడ్డంకిగా మారుతోందని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ యూనియన్ బడ్జెట్ లో చేర్చాల్సిందిగా చేసిన ప్రతిపాదనలలో ఒక్కటి కూడా మంజూరు చేయలేదని, ఇప్పటికైనా తెలంగాణను రాజకీయంగా శిక్షించే బడ్జెట్‌లు ఇక మానుకోని, ఫెడరలిజాన్ని గౌరవించి, తెలంగాణకు న్యాయమైన వాటా ఇవ్వాలని, లేకపోతే "వికసిత్ భారత్" ఒక నినాదంగానే మిగిలిపోతుందని, నిజమైన అభివృద్ధి సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. ఈ విషయంలో రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి నాయకులు కూడా తెలంగాణకు రావాల్సిన న్యాయబద్ధమైన వాటాకోసం కేంద్రంతో పోరాడటానికి మాతో కలిసి రావాలని మంత్రి కోరారు.

# ఎల్బీనగర్ ఉప్పల్ నియోజకవర్గం లో

## అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన రాష్ట్రమంత్రి దుద్దిళ్ళశ్రీధర్ బాబు






ఎల్బీనగర్ నియోజకవర్గం లో రూ. 11 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధు యాష్కీ గౌడ్.

హస్తినాపురం డివిజన్ లో రూ. 5 కోట్ల 95 లక్షల నిధులతో నిర్మించ తలపెట్టిన ఎల్బీనగర్ సర్కిల్ మరియు వార్డు కార్యాలయ భవన సముదాయాల నిర్మాణం పనులను ప్రారం భిం చిన శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ వీప్ డాక్టర్‌పట్నంమహేందర్ రెడ్డి ,రాష్ట్ర ఐటీ ,పరిశ్రమలు మరియు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఎమ్మెల్సీ దయానంద్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధు యాష్కీ గౌడ్.

వనస్థలిపురంలోని నాగార్జున కాలనీలో, శ్రీనివాస పురం కాలనీలో పైప్లైన్ల నిర్మాణానికి రూ. 2 కోట్ల 76 లక్షలు,

రూ. కోటి 87 లక్షల నిధులతో వనస్థలిపురం లోని సుష్మ థియేటర్ నుండి రైతు బజార్ మరియు...

ఉప్పల్ : నియోజకవర్గం లోని పలు పరిసరాల్లో రూ . 62 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన రాష్ట్ర మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు, శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి,ఎంఎల్‌ఏ లక్ష్మారెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి.

రూ. 19 కోట్ల 12 లక్షల, రూ. 35 కోట్ల ఎస్‌ఎండిపి నిధులు, రూ. 8 కోట్ల 50 లక్షల హెచ్‌ఎండిఏ నిధులు, రూ. 10 లక్షలతో కూరగాయ మార్కెట్లో మంచినీటి ప్లాంటు, రూ. 2 కోట్ల నిధులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులను ప్రారంభించిన శ్రీధర్ బాబు, మహేందర్ రెడ్డి,ఎంఎల్‌ఏ లక్ష్మారెడ్డి.

# విక్టోరియా ప్లే గ్రౌండ్ అభివృద్ధి పనులపై న విజిలెన్స్ విచారణ చేపట్టాలి :సతీష్‌గౌడ్






**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:**గోషామహల్ నియోజకవర్గం ghmc పరిధిలో వున్న పాత గంఫౌంద్రి డివిజన్ ఈసమియా బజార్ ప్రాంతంలోని victory play ground లో జరిగిన అభివృద్ధి పనులపై న విజిలెన్స్ విచారణ చేపట్టాలి అంత నాసిరకమైన మటీరియల్ వాడడం అప్పుడే ఫెన్సెయింగ్ కు రంధ్రం కావడం పాటించుకొని కాంట్రాక్టర్, సిబంది, వాటి నిర్వహణ లోపాలు, గ్రౌండ్స్ నిర్వహణ బాధ్యతలను స్థానిక సంక్షేమ సంఘాల వారికీ అప్పగించాలని జీహెచ్ఎంసీ మేయర్ కువినతి పత్రం ఇచ్చిన సతీష్‌గౌడ్

# రూ. 1511 కోట్ల విలువైన భూమికి హైడ్రా ఫెన్సింగ్.

-- ఆక్రమణలపై నగరం నలువైపులా హైడ్రా చర్యలు.

-- కొండాపూర్‌లో 4 ఎకరాల చెరువును కాపాడిన హైడ్రా.

-- అల్వాల్ కొత్త చెరువు ఆక్రమణలు 8 ఎకరాల మేర తొలగింపు.

-- రాధాకృష్ణ నగర్‌లో 450 గజాల పార్కును కాపాడిన హైడ్రా.

-- జక్కిడి కాలనీలో 650 గజాల పార్కుకు హైడ్రా ఫెన్సింగ్.








**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**ఆక్రమణలను హైడ్రా సీరియస్‌గా పరిగణిస్తోంది. పార్కులు, చెరువులను చెరపట్టిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. మంగళవారం ఒకే రోజు నగరం నలువైపులా 4 చోట్ల భారీ ఆపరేషన్ నిర్వహించి ఆక్రమణలు తొలగించింది. వెనువెంటనే ఫెన్సింగ్ వేసింది. రెండు చోట్ల 1100ల గజాల మేర ఉన్నపార్కులను కాపాడగా.. మరో రెండు ప్రాంతాల్లో 12 ఎకరాల మేర చెరువుల ఎఫ్‌టీఎల్ ప్రాంతాలను హైడ్రా రక్షించింది. ఇలా కాపాడిన భూమి విలువ సుమారుగా రూ. 1511ల కోట్ల వరకూ ఉంటుందని అంచనా.

కొండాపూర్‌లో చెరువును కాపాడిన హైడ్రా..

శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం - మదీనాగూడ రోడ్డు మార్గం కొండాపూర్‌లో రూ. 700 కోట్ల విలువైన భూమిని హైడ్రా మంగళవారం కాపాడింది. 4 ఎకరాల జంగం కుంటను పూడ్చేసి.. మట్టితో చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు సిద్ధమైన కబ్జాదారుల ఆట కట్టించింది హైడ్రా. ఇటీవల మీడియాలో వచ్చిన కథనాల మేరకు రెవెన్యూ అధికారులతో హైడ్రా జాయింట్ ఇన్స్పెక్షన్ చేసింది. జంగం కుంటగా హైడ్రా నిర్ధారించుకుంది. కబ్జా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు కేసులు కూడా పెట్టారు. హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారి ఆదేశాల మేరకు మంగళవారం ఫెన్సింగ్ వేసింది.

అల్వాల్ కొత్త చెరువులో ఆక్రమణల తొలగింపు..

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్ కొత్త చెరువు 8 ఎకరాల మేర ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాస్టిక్ కంప్రెసివ్ యూనిట్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యకలాపాలు నిర్వహిస్తూ చెరువును కలుషితం చేస్తున్నారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే అక్కడ పని వారికోసం తాత్కాలిక షెడ్డులు వేసి వ్యర్థాలన్నీ చెరువులోకి వదులుతున్నారని పేర్కొన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని టెంటు సామగ్రికి చెందిన 4 షట్టర్లు కూడా వేసినట్టు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదనే నిబంధన పట్టకుండా ఏర్పాటు చేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది.

1100ల గజాల మేర పార్కులను కాపాడిన హైడ్రా..

రంగారెడ్డి జిల్లా వనస్థలిపురం సాహెబ్‌నగర్ కలాన్‌లోని జక్కిడినగర్ కాలనీలో 650 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 132, 133లో 1982లో 12 ఎకరాల మేర దాదాపు 161ప్లాట్లతో జక్కిడి కుటుంబ సభ్యులు లే ఔట్ వేశారు. ఇందులో 650 మేర పార్కుకోసం కేటాయించారు. 1985లోనే దీనిని ప్లాట్లుగా చేసి లే ఔట్ వేసిన వారే అమ్మేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ప్రహరీతో పాటు.. రెండు షెడ్డులు నిర్మించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించి పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. ఈ మేరకు మంగళవారం ఆక్రమణలు తొలగించి.. పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. మల్కాజిగిరి జోన్, మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయ నగర్‌లో రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో 450 గజాల పార్కును హైడ్రా కాపాడింది. జీహెచ్ ఎంసీకి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన ఈ పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీతో పాటు.. రేకుల షెడ్డును హైడ్రా మంగళవారం తొలగించింది.

# చాదర్ ఘాట్ లో ఆధునీకరించిన విక్టోరియా ప్లే గ్రౌండ్ ను ప్రారంభించిన మేయర్









**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్ 10, ఫిబ్రవరి 2026 చాదర్ ఘాట్ లో అప్ గ్రేడెషన్, రెనో వేట్ చేసిన విక్టోరియా ప్లే గ్రౌండ్ ను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ లతో కలిసి మంగళవారం ప్రారంభించారు.పునరుద్ధరించిన విక్టోరియా ప్లే గ్రౌండ్ లో ఉన్న బాస్కెట్ బాల్ నెట్, క్రికెట్ నెట్ స్థానిక క్రీడాకారులకు తమ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఎంతో ఉపకరిస్తుందనీ మేయర్ తెలిపారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడాకారులుగా రాణించాలని ఆమె కోరారు.కార్యక్రమంలో గోల్కొండ జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్టడీ టూర్ నివేదికను కమిషనర్‌కు అందజేసిన జీహెచ్ఎంసీ మేయర్




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్, ఫిబ్రవరి 10, 2026: జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్టాండింగ్ కమిటీ సభ్యులతో కలిసి స్టడీ టూర్ నివేదికను కమిషనర్ ఆర్.వి. కర్ణన్కు అందజేశారు. అహ్మదాబాద్, రాజ్‌కోట్‌లలో అమలవుతున్న జీపీఎస్ ఆధారిత ఇంటింటి చెత్త సేకరణ, డబుల్ షిఫ్ట్ పారిశుద్ధ్య విధానం, యంత్రాల ద్వారా ఊడ్పు, ఫేస్ రికగ్నిషన్ హాజరు విధానం, ఆన్‌లైన్ మానిటరింగ్ వంటి ఉత్తమ పద్ధతులను నివేదికలో ప్రస్తావించారు. హైదరాబాద్‌లోవ్యర్థాల సేకరణ, నిర్వహణ లో ఈ విధానాలను దశలవారీగా అమలు చేయవచ్చని మేయర్ తెలిపారు. ఈ సూచనలను పరిశీలించి అమలు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తామని కమిషనర్ తెలిపారు.

# 1.83 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన




**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**హైదరాబాద్, ఫిబ్రవరి 10, 2026: ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలో రూ.1.83 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఎమ్మెల్యే ముఠా గోపాల్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి లతో కలిసి మంగళవారం ప్రారంభించారు.

వీటిలో ముషీరాబాద్ వార్డులోని గంగపుత్ర కాలనీలో రూ. 70 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులు, గాంధీనగర్లోని మాల బస్తీలో రూ.42 లక్షల తో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులు,కవాడిగూడ వార్డులోని అడ్వొకేట్ కాలనీలో రూ.30 లక్షల తో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు , రామ్‌గోపాల్‌పేట్ వార్డులోని కృష్ణనగర్ కాలనీలో రూ.41 లక్షల తో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఉన్నాయి.

ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... నగరంలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల అభివృద్ధికి గడిచిన ఐదేండ్లలో జీహెచ్ఎంసీ ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు . శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను మేయర్ ఆదేశించారు.

డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ....

జిహెచ్ఎంసి పరిధిలో పౌర సదుపాయాల పెంపుకుజీహెచ్ఎంసీఅధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు.

కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవికిరణ్, జీహెచ్ఎంసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# 21నియోజకవర్గాల్లో అభివృద్ధి సూపర్ గ్రేడింగ్ లు ఇచ్చిన ప్రభుత్వం

విజయవాడ, ఫిబ్రవరి 10, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పనితీరు సూచీలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పరుగులు పెడుతోంది. వివిధ అభివృద్ధి ,సంక్షేమ సూచికల ఆధారంగా 175 నియోజకవర్గాల ర్యాంకింగ్స్ ఇచ్చింది. ప్రభుత్వం నిర్దేశించిన వివిధ అభివృద్ధి సూచికలు , సంక్షేమ పథకాల అమలు, ప్రజల సంతృప్తిని ప్రాతిపదికగా తీసుకుని ప్రకటించిన ఈ ర్యాంకుల్లో మెజారిటీ నియోజకవర్గాలు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. మొత్తం 175 నియోజకవర్గాల్లో 21 నియోజకవర్గాలు ఏ ప్లస్ (ఎ+) గ్రేడ్ సాధించగా, 153 నియోజకవర్గాలు ఏ గ్రేడ్ దక్కించుకున్నాయి. కేవలం ఒకే ఒక నియోజకవర్గం బి గ్రేడ్‌కు పరిమితం కావడం గమనార్హం. వీటిలో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన 13 నియోజకవర్గాలు రాష్ట్రానికి రోల్ మోడల్స్‌గా నిలిచాయి. రాష్ట్రంలోనే 93 శాతం మార్కులతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నది విజయవాడ పశ్చిమ నియోజకవర్గం. ఎమ్మెల్యే సుజనా చౌదరి మార్క్ అభివృద్ధికి నిదర్శనంగా నిలిచింది. ఇక్కడ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, పారిశుద్ధ్య నిర్వహణలో సాధించిన పురోగతి ఈ ర్యాంకు సాధనలో కీలక పాత్ర పోషించాయి. క్షేత్రస్థాయిలో ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం , విద్యా, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో సుజనా చౌదరి చూపిన చొరవ ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టింది.రెండవ స్థానంలో నిలిచిన గాజువాకకు 92 మార్కులు వచ్చాయి. నియోజకవర్గం పారిశ్రామికాభివృద్ధి , స్థానిక మౌలిక వసతుల కల్పనలో ఆదర్శంగా నిలిచింది. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలోని కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం మరియు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టారు. అలాగే, మూడవ స్థానాన్ని దక్కించుకున్న కాకినాడ నగర నియోజకవర్గం స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అమలులోనూ, పారదర్శకమైన ప్రజా పంపిణీ వ్యవస్థలోనూ మేటిగా నిలిచింది. డిజిటల్ గవర్నెన్స్‌ను ప్రజలకు చేరువ చేయడంలో ఈ నియోజకవర్గ ప్రజాప్రతినిధుల కృషి స్పష్టంగా కనిపిస్తోంది.అలాగే నాలుగవ స్థానంలో నిలిచిన విజయవాడ తూర్పు నియోజకవర్గం కూడా పారిశుద్ధ్యం, పౌర సేవలలో అద్భుతమైన స్కోరును సాధించింది. ఈ ర్యాంకింగ్స్ కేవలం అంకెలకు పరిమితం కాకుండా, ఎమ్మెల్యేల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచడానికి దోహదపడుతున్నాయి. ప్రతి రూపాయి ప్రజల కోసమే ఖర్చు కావాలన్న ప్రభుత్వ సంకల్పం, ఈ ఫలితాల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రతిబింబిస్తోంది. ఏ ప్లస్ నియోజకవర్గాల స్ఫూర్తితో మిగిలిన ప్రాంతాల్లో కూడా పాలనను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# మొదట మున్సిపాలిటీ, తరువాత పంచాయతీ ఎన్నికలు..

విజయవాడ, ఫిబ్రవరి 10, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తోంది. మార్చి 9వ తేదీన మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం ముగియ వస్తుండటంతో, సకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ సిద్ధమవుతోంది.

కొత్త ఓటర్ల జాబితా తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్లు జారీ చేశారు.ఏపీలో మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం వచ్చే నెల 17తో ముగియనుంది. మరోవైపు గ్రామ పంచాయతీలో పదవీకాలం ఏప్రిల్ 2న ముగియనుంది. ?మున్సిపల్ పోరుకు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే జిల్లాల వారీగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 జనవరి 1వ తేదీని ప్రామాణికంగా తీసుకుని కొత్త ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఎస్ఈసీ ఆదేశించింది. మార్చి 9న ఫోటోలతో కూడిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.ఏపీలో మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) ఉన్నాయి. వీటిలో మెజారిటీ స్థానాలకు ఈ విడతలో ఎన్నికలు జరగనున్నాయి. 13,351 పంచాయతీలలో ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు మొదలు కానున్నాయి. ఇప్పటికే వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల ఓటర్ జాబితాకు నోటిఫికేషన్ రావడమంటే ఎన్నికల నగరాలో తొలి ఘట్టం అని తెలిసిందే. స్థానిక సంస్థల నోటిఫికేషన్ తేదీపై స్పష్టత రావడంతో ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ రాజకీయ సమీకరణాలు మొదలుపెడతాయి.

# నైరాశ్యంలో వైసీపీ నేతలు

నెల్లూరు ఫిబ్రవరి 10, 2024 ఎన్నికల అనంతరం ఇప్పటి వరకు వైసీపీ లో స్పష్టమైన ఉత్సాహం కనిపించలేదు. నెక్స్ట్ ఎన్నికలకు ఇంకా సమయం ఉందని భావించిన చాలా మంది నేతలు, ఇప్పుడే ఎందుకు బహిరంగంగా కదలాలన్న ఆలోచనలోనే ఉండిపోయారు. మరికొందరు మాత్రం పార్టీ కార్యక్రమాలకంటే తమ వ్యక్తిగత ఇమేజ్ పెంచుకోవడమే సరిపోతుందన్న భావనతో ముందుకు సాగారు. అందుకే గత 19 నెలలుగా పార్టీ పిలుపునిచ్చిన ఉద్యమాలు, నిరసనలకు పెద్దగా స్పందన కనిపించలేదు. పూర్తిగా దూరంగా కూడా ఉండకుండా, ప్రజల్లోకి వెళ్లినట్టు వెళ్లి, కార్యక్రమాలు జరిగాయన్న ముద్ర వేసినట్టే వ్యవహారం సాగింది.ఈ పరిస్థితిపై పార్టీ అధినేత జగన్ పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. నేతల్లో చురుకుదనం రావాలని, ప్రజల మధ్య కలివిడిగా ఉండాలని సూచనలు చేశారు. అయినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. అయితే ఇటీవల జరిగిన రెండు పరిణామాలు మాత్రం పార్టీ వాతావరణాన్ని పూర్తిగా మార్చేశాయి. ఒక్కసారిగా నేతలంతా ఏకం కావడం మొదలైంది. ఉత్తరాంధ్ర నుంచి సీమ వరకు వైసీపీ శ్రేణుల్లో కదలిక పెరిగింది.అంబటి రాంబాబు (, జోగి రమేష్ ఇళ్లపై దాడులు జరగడం ఈ మార్పుకు ప్రధాన కారణంగా మారింది. ఈ ఘటనలను పార్టీ నేతలు తేలిగ్గా తీసుకోలేదు. ఇది కేవలం వ్యక్తిగత అంశం కాదని, తమ రాజకీయ స్వరాన్ని అణిచివేసే ప్రయత్నంగా భావించారు. ముఖ్యంగా కాపు, బీసీ వర్గాలను ఏకం చేయడం, పార్టీ వాయిస్‌ను గట్టిగా వినిపించడం అవసరమని నాయకత్వం భావించింది. అందుకే ఈ అంశాలను భుజాన వేసుకుని, ప్రజల్లోకి వెళ్లేందుకు నేతలు సిద్ధమవుతున్నారు.గతాన్ని పరిశీలిస్తే, ఇలాంటి పరిస్థితి ఒకప్పుడు టీడీపీలో కూడా కనిపించింది. 2019 నుంచి 2021 మధ్య ఆ పార్టీలోనూ నైరాశ్య వాతావరణం నెలకొంది. సమావేశాలు పెట్టినా పెద్దగా స్పందన రాలేదు. అయితే నందిగామ )లో చంద్రబాబు నాయుడు పై రాళ్ల దాడి, పార్టీ కార్యాలయంపై దాడులు జరిగిన తర్వాత పరిస్థితి మారింది. అప్పటివరకు వెనుకంజలో ఉన్న నేతలు ఒక్కసారిగా ముందుకు వచ్చారు. పార్టీని, నాయకుడిని కాపాడుకోవాలన్న భావన వారిని ఏకం చేసింది.ఇప్పుడు అదే తరహా సమీకరణ వైసీపీలో జరుగుతోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. నేతలు వ్యక్తిగతంగా కాకుండా, సమష్టిగా పార్టీ కోసం నిలబడాలన్న భావన బలపడుతోంది. ఈ కదలిక ఎన్నికల వరకు ఎంతవరకు కొనసాగుతుంది, పార్టీకి ఎంత మేలు చేస్తుందన్నది కాలమే నిర్ణయించాలి. అయితే ప్రస్తుతం మాత్రం వైసీపీలో కనిపిస్తున్న ఐక్యత రాజకీయంగా కీలక సంకేతంగా మారిందని చెప్పాలి.

# కారు సర్వీసు సెంటర్ లో భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాద్ రాజేంద్ర నగర్ లో భారీ అగ్ని ప్రమాద ఘటనలో పలు కార్లు దగ్ధం అయ్యాయి.లక్షల్లో నష్టం వాటిల్లింది. ఘటన సోమవారం రాత్రి జరిగింది. స్థానిక మారుతి సుజుకి సర్వీస్ సెంటర్ లో ప్రమాద వశాత్తు మంటలు చెలరేగాయి. ఈ భవనం పక్కన ప్రక్కన అపార్ట్మెంట్ ఉండటం వల్ల అపార్ట్మెంట్ కి మంటలు వ్యాపించే పరిస్థితి తలెత్తింది. దాంతో అపార్ట్ మెంట్ వాసులంతా బయటకు వచ్చేసారు. ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని అతి కష్టంతో మంటలను అదుపు చేసారు.

# చెన్నూరులో రాక్షస పాలన నడుస్తుంది బాల్క సుమన్

చెన్నూరు లో రాక్షస పాలన నడుస్తుందని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారరు. చెన్నూరు మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నాయకుడు మల్లేశం గౌడ్ ఇంట్లో ఎన్నికల అధికారులు, పోలీసుల తనిఖీలు నిర్వహించారు. సోదాలు చేస్తున్న అధికారుల తీరుపై బాల్క సుమన్ మండిపడ్డారు. మంత్రి వివేక్ పంపిస్తేనే వచ్చి అధికారలు సోదా చేస్తున్నారని అన్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో డబ్బులు, మందు సీసాలు ఉన్నాయి, అవి పోలీసులకు, అధికారులకు కనపడవు.. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదు. అధికారులు, పోలీసులు మంత్రి వివేక్కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారు. కేవలం బీఆర్ఎస్ నాయకులనే టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ఇతర కాంగ్రెస్ నాయకుల ఇళ్లలో సోదాలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.

# స్కూల్ బస్సును ఢీకొట్టిన ట్రాక్టర్.. ఇద్దరు మృతి, 12 మందికి తీవ్రగాయాలు

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం శ్రీనగర్ క్రాస్ రోడ్డు వద్ద ఘోర ప్రమాదం తీగరాజుపల్లికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును ట్రాక్టర్ ఢీకొట్టింది. ఘటన ప్రమాద సమయంలో బస్సులో 40 మంది పిల్లలు ఉండగా, ట్రాక్టర్లో 12 మంది ఉన్నట్లు సమాచారం. ట్రాకర్ లో వున్నవారంతా అన్నారం షరీఫ్ దర్గాలో కందూరు చేసుకొని వస్తున్నారు.ట్రాక్టర్ డ్రైవర్ మద్యంమత్తులో అతివేగంగా నడపడమే ప్రమాదానికి కారణం. స్కూలు బస్సును ఢీకొని ట్రాక్టర్ బోల్తా పడడంతో దానిలో ప్రయాణిస్తున్న ఒక చిన్నారితో పాటు డ్రైవర్ మృతి చెందారు స్కూల్ బస్సులో ప్రయాణిస్తున్న పిల్లలకు స్వల్ప గాయాలు అయ్యాయి.

# రాజ్యసభ రేసు... మా కో సీటు కావాలంటూ వినతులు

విజయవాడ, ఫిబ్రవరి 10, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఇప్పుడు 'రాజ్యసభ సీట్ల' చుట్టూ తిరుగుతున్నాయి. వచ్చే జూన్ నెలలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల కోసం అధికార కూటమిలో ఇప్పటి నుంచే సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. శాసనసభలో కూటమికి ఉన్న తిరుగులేని బలంతో ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవం కావడం ఖాయమని తేలిపోవడంతో, ఆ సీట్లను దక్కించుకునేందుకు ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది.ప్రస్తుత అంచనాల ప్రకారం, మొత్తం 4 స్థానాల్లో తెలుగుదేశం పార్టీ రెండు, బీజేపీ ఒకటి, జనసేన ఒక స్థానాన్ని పంచుకునే అవకాశం కనిపిస్తోంది. తమకు ఖచ్చితంగా ఒక స్థానం కేటాయించాలని పవన్ కల్యాణ్ పట్టుబడుతున్నారు. ఇప్పటికే ఆయన ఢిల్లీ వెళ్లి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించినందున, తమ పార్టీకి పెద్దల సభలో ప్రాతినిధ్యం ఉండాలని జనసేన గట్టిగా కోరుతోంది.జనసేన కోటాలో సీటు దక్కితే, ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీకి ఆయన అందిస్తున్న సహకారం, పవన్ కల్యాణ్‌తో ఉన్న సాన్నిహిత్యం ఆయనకు ప్లస్ కానున్నాయి. టీడీపీతో సత్సంబంధాలు రమేశ్ కు కలిసొచ్చే అంశంఇక టీడీపీకి దక్కే రెండు స్థానాల కోసం పార్టీ సీనియర్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, దేవినేని ఉమా మహేశ్వర రావు, పార్టీ విధేయుడు కంభంపాటి రామ్మోహన్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుత సభ్యుడు సానా సతీశ్ తన పదవిని రెన్యూవల్ చేసుకోవాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక సమీకరణాలు, పార్టీ అవసరాల దృష్ట్యా చంద్రబాబు ఎవరిని ఎంపిక చేస్తారనేది ఆసక్తికరంగా మారింది.బీజేపీకి దక్కే ఒక స్థానం విషయంలో అత్యంత ఆశ్చర్యకరమైన చర్చ జరుగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉండి ఆ పార్టీ నుంచి బయటికొచ్చిన విజయసాయి రెడ్డి, అనూహ్యంగా బీజేపీ తరపున రాజ్యసభకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారనే వార్తలు రాజకీయ వర్గాలను షేక్ చేస్తున్నాయి. ఆయన ఇప్పటికే ఎంపీ పదవికి రాజీనామా చేయడం, బీజేపీ పెద్దలతో టచ్‌లోకి వెళ్లడం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. ఇటీవలే తాను జూన్ నుంచి రాజకీయాల్లో యాక్టివ్ అవుతానని ప్రకటించడంతో రాజ్యసభ సీటు ఊహాగానాలు నిజమేనేమో అనిపిస్తోంది. అయితే, బీజేపీ అధిష్టానం స్థానిక నేతలకు ఇస్తుందా లేక బయటి వ్యక్తులను ప్రోత్సహిస్తుందా అనేది సస్పెన్స్‌గా మారింది.కూటమిలోని మూడు పార్టీల మధ్య ఎక్కడా అసంతృప్తి రాకుండా, సమన్యాయం ప్రాతిపదికన సీట్ల పంపకం ఉండాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. జూన్ నాటికి ఈ సమీకరణాలు మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉంది. ఏది ఏమైనా, ఈసారి ఏపీ రాజ్యసభ ఎన్నికలు కేవలం అభ్యర్థుల ఎంపిక మాత్రమే కాదు.. కూటమి పార్టీల మధ్య సమన్వయానికి, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలకు ఒక పరీక్షగా నిలవనున్నాయి.

# ఆల్ ఇన్ వన్ స్మార్ట్ కార్డులు

ఏలూరు, ఫిబ్రవరి 10, పాలనలో సరికొత్త సంస్కరణలు తీసుకువస్తున్న ఏపీ ప్రభుత్వం మరో సరికొత్త ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటి 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని నిర్ణయించింది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద ఈ కార్డులను అందించనున్నారు. సోమవారం రోజున జరిగిన సమీక్షా సమావేశంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులపై అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. జూన్ నాటికి రాష్ట్రంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు పౌరసేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా పాలనాపరంగా పలు సంస్కరణలు తీసుకువస్తోంది. ఈ క్రమంలోనే పాలనలో టెక్నాలజీ వినియోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డులు అందించిన ఏపీ ప్రభుత్వం.. ఇప్పుడు మరో స్మార్ట్ ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని ఆలోచన చేస్తోంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ సిస్టమ్ ద్వారా వచ్చే జూన్ కల్లా రాష్ట్రంలోని కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.సంజీవని ప్రాజెక్టు, జనాభా నిర్వహణ, పౌష్టికాహారం వంటి అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సంజీవని ప్రాజెక్టు కింద జులై నాటికి రాష్ట్రంలోని 66 లక్షల హైరిస్క్ కేసులకు హెల్త్ స్క్రీనింగ్ చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలోనే ఫ్యామిలీ బెనిఫిట్ కార్డుల గురించి చంద్రబాబు చర్చించారు. జూన్ నాటికి రాష్ట్రంలోని కుటుంబాలకు వీటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు వచ్చే సంవత్సరానికి ఏపీని ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ప్రకటిస్తామని చంద్రబాబు తెలిపారు.మరోవైపు ఈ ఏడాది జూన్‌లోగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డులను ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు పంపిణీ చేయనుంది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద ఈ కార్డులను అందిస్తారు. ప్రతీ కుటుంబాన్ని ఓ యూనిట్ కింద పరిగణిస్తారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డుల మీద ప్రత్యేకంగా ఓ క్యూఆర్ కోడ్ ముద్రిస్తారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ కుటుంబం సమాచారం, వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు, పీ4 అంశాలు వంటివి తెలిసేలా ఈ కార్డులను డిజైన్ చేయనున్నారు.అలాగే ఈ కార్డుల సాయంతో రేషన్ కార్డు సేవలు, ఉపకార వేతనాలు, కులధ్రువీకరణ పత్రాలు, పింఛన్ల వివరాలు, వ్యాక్సినేషన్ వంటి వివరాలను ట్రాక్ చేసేలా ప్రణాళికలు రచిస్తున్నారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డులలో కుటుంబం మొత్తం వివరాలు ఉండటంతో.. సంక్షేమ పథకాల అమలు సమయంలో అర్హులకు లబ్ధి చేకూరనుంది. అలాగే పౌరసేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే కుటుంబం మొత్తం సమాచారం ఉండటంతో పత్రాలను మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదు.

# ఏపీలో మరో అండర్‌పాస్

నెల్లూరు, ఫిబ్రవరి 10, ఏపీలో మరో అండర్‌పాస్ నిర్మాణం దిశగా కీలక ముందడుగు పడింది. నెల్లూరులో కీలకమైన అండర్‌పాస్ నిర్మాణానికి భూసేకరణ చేపట్టారు. ఇప్పటికే ఈ అండర్‌పాస్ నిర్మాణం కోసం రూ.115 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే అధికారులు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అన్ని కుదిరితే ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. నెల్లూరుకు ఈ అండర్‌పాస్ కీలకంగా మారనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల్ని వేగవంతం చేసింది. రోడ్లు, రైల్వే లైన్లు, ఫ్లై ఓవర్లు, ఆర్వోబీలు, అండర్‌పాస్‌లు.. ఇలా ఎన్నో పనులు చేపడుతోంది. తాజాగా నెల్లూరు దగ్గర రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెడుతూ అండర్ పాస్ నిర్మాణానికి సిద్ధమైంది. నెల్లూరు సమీపంలోని చింతారెడ్డిపాళెం వెళ్లే జంక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణం చేయనున్నారు. ఈ అండర్ పాస్‌ను ఏకంగా ఆరు వరుసలుగా నిర్మించనున్నారు. వాస్తవానికి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును గతేడాది నవంబరులో మంజూరు చేసింది. అంతేకాదు టెండర్ల ప్రక్రియను పూర్తి చేయగా.. ప్రస్తుతం భూసేకరణ చేపట్టారు. ఈ పనులు శరవేగంగా పూర్తిచేసి.. ఏప్రిల్ మొదటి వారంలో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఈ అండర్‌పాస్ పనుల్ని పర్యవేక్షిస్తున్నారు.ఈ అండర్‌పాస్ కోసం మొత్తం రూ.115.27 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే అండర్‌పాస్ నిర్మాణానికి 3.57 ఎకరాలు భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఈ నిధుల్లో రూ.22 కోట్లు భూసేకరణ కోసం కేటాయించారు. ఈ అండర్‌పాస్ కోసం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి.. వెంటనే అధికారులు పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అన్నీ కుదిరితే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అండర్‌సాస్ పనులు ప్రారంభించి.. దాదాపు 15 నెలల్లో పూర్తి చేయిస్తామని చెబుతున్నారు అధికారులు. అందుకే భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నారు అధికారులు.ఈ అండర్‌పాస్‌ను చింతారెడ్డిపాళేనికి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీ జంక్షన్ నుంచి హరనాథపురం చివర కలిసే కృష్ణపట్నం రోడ్డు దగ్గర దాబా వరకు పనులు చేపట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ అండర్‌పాస్ ప్రస్తుతం సుమారు 2.12 కి.మీ. పొడవుతో ఉంది. ఇప్పుడు ఉన్న నాలుగు లైన్ల రోడ్డు స్థానంలో ఆరు వరుసల అండర్ పాస్ వచ్చేలా ప్లాన్ చేశారు. ఈ అండర్‌పాస్ అందుబాటులోకి వస్తే రోడ్డు ప్రమాదాలు నియంత్రించొచ్చని.. ట్రాఫిక్ ఫ్రీ జర్నీ చేయొచ్చు అంటున్నారు. మొత్తం మీద నెల్లూరు నగరానికి మరో అండర్‌పాస్ రాబోతోంది.

# జనారణ్యంలోకి జంతువులు

అదిలాబాద్, ఫిబ్రవరి 10, దట్టమైన వృక్షాలు. ఆకాశాన్ని తాకే విధంగా కొండలు.. గలగల పారే సెలయేర్లు.. అందులో రకరకాల జంతువులు.. ఫలితంగా జీవావరణం అద్భుతంగా ఉండేది. ప్రకృతి సమతుల్యం గొప్పగా అనిపించేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఎందుకంటే అభివృద్ధి వల్ల చెట్లు నేల కూలిపోయాయి. కొండలు కరిగిపోయాయి. సెలయేర్లు కాలగర్భంలో కలిసిపోయాయి.అడవిని నమ్ముకున్న జంతువులు ఒక్కొక్కటిగా చనిపోతున్నాయి. ఉన్న జంతువులు జనావాసాలాలో పడి కన్నుమూస్తున్నాయి. పెద్దపులి నుంచి మొదలు పెడితే జింకల వరకు ఇదే పరిస్థితి. కొన్ని సందర్భాలలో ఉన్న అడవుల్లో కూడా పులులకు ఆహారం దొరకడం లేదు. ఆహార అన్వేషణలో భాగంగా పులులు ఉన్న ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి వస్తున్నాయి. ఆ సమయంలో ఆహారం లభించక.. ఆవాసం దొరకక నరకం చూస్తున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో యాదాద్రి, జనగామ జిల్లాలలో మహారాష్ట్రలోని పాండవ ఖరా టైగర్ రిజర్వ్ నుంచి ఒక పులి వచ్చింది. ఈ పులి ముందుగా ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ ప్రాంతంలోకి ప్రవేశించింది. ఆ తర్వాత 250 కిలోమీటర్ల వరకు ప్రయాణించి యాదాద్రి, జనగామ జిల్లాలలో ప్రవేశించింది. యాదాద్రి జిల్లాలోని కొలనుపాక ప్రాంతం నుంచి లింగాల గణపురం మండలం కుందారం గ్రామం శివారులోకి వచ్చింది. అక్కడ ఓ రైతుకు సంబంధించిన లేక దూడను చంపి తినేసింది. ఈ విషయం అటవీశాఖ అధికారులకు తెలియడంతో వారు పులి పాదముద్రలను పరిశీలించారు. అంతేకాదు ప్రజలకు సూచనలు చేశారు. రాత్రిపూట ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరించారు.వాస్తవానికి ఈ ప్రాంతాల్లో పులి కనిపించక దాదాపు 50 సంవత్సరాలు దాటిపోయింది. గతంలో ఈ ప్రాంతాలలో అడవులు విస్తారంగా ఉండేవి. కానీ, క్రమక్రమంగా అడవులు తగ్గిపోవడంతో పులులు కనుమరుగైపోయాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పులులకు కూడా సరైన ఆవాసం, ఆహారం లభించకపోవడంతో జనావాసాల్లోకి వస్తున్నాయి. చివరికి ప్రాణాలు కోల్పోతున్నాయి. మహారాష్ట్ర నుంచి వచ్చిన పులి పరిస్థితి కూడా ఇలానే ఉంది. అది ఆహార అన్వేషణ కోసం.. మనుగడ కోసం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉపయోగం ఉండడం లేదు.

# మున్సిపల్స్ కు అంతా రెడీ

## బరిలో 12,930 మంది అభ్యర్థులు

## మరి కొద్ది గంటల్లో పోలింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 10, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎటువైపు ఉండనుందో బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తంకానుంది. గత పది రోజులుగా హోరెత్తిన మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి తెరపడింది. బుధవారం పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో నిబంధనల ప్రకారం సోమవారం సాయంత్రం అయిదు గంటలకు అధికారికంగా ప్రచారం ముగిసింది. రాష్ట్రంలోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లోని 2,982 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. మరో 14 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఈ ఎన్నికల్లో 52.43 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 12,930 మంది తమ భవితవ్యాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో ఏ పార్టీ సైతం అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలపకపోవడం విశేషం. ఈ ఎన్నికల్లో మరో విశేషం సైతం నమోదైంది. మొత్తం అభ్యర్థుల్లో మహిళా అభ్యర్థులే అధిక సంఖ్యలో ఉన్నారు. మొత్తం 12,930 మందిలో పురుషులు 6,434 (49.76 శాతం) మంది కాగా, మహిళలు 6,496 (50.24 శాతం) మంది.

అత్యధికంగా కరీంనగర్‌లో అభ్యర్థులు

అత్యధికంగా కార్పొరేషన్లలో కరీంనగర్‌లో మొత్తం 66 డివిజన్లకు గాను 398 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మున్సిపాలిటీలలో ఆదిలాబాద్‌లో 49 వార్డులకు గాను 314 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అత్యల్పంగా కొడంగల్ మున్సిపాలిటీలో 12 వార్డులకు గాను 34 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. పార్టీల వారీగా చూస్తే..

అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ 2,948 (98.3 శాతం) స్థానాల్లో, బీఆర్ఎస్ 2,878 (96 శాతం) స్థానాల్లో, బీజేపీ 2,634 (87.3 శాతం) స్థానాల్లో పోటీలో నిలిచాయి. మరోవైపు స్వతంత్ర అభ్యర్థులు 2,786 (94 శాతం) స్థానాల్లో బరిలో నిలిచారు. జనసేన పార్టీ 332 (11.1 శాతం) స్థానాల్లో, మజ్లిస్ పార్టీ 282 (9.4 శాతం) స్థానాల్లో, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ 288 (9.6 శాతం) స్థానాల్లో, బీఎస్పీ 213 (7.3 శాతం) స్థానాల్లో, సీపీఐ 168 (5.6 శాతం) స్థానాల్లో, సీపీఎం 108 (4.2 శాతం) స్థానాల్లో, ఆప్ 38 (1.2 శాతం) స్థానాల్లో, ఐయూఎంఎల్ తొమ్మిది (0.3 శాతం) స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలో దింపాయి. టీడీపీ, వైఎస్సార్‌సీపీ పార్టీల నుంచి పలువురు నామినేషన్లు వేసినప్పటికీ, బీఫారాలు సమర్పించకపోవడంతో అవి తిరస్కరణకు గురయ్యాయి. మరోవైపు ఖమ్మం జిల్లాలో టీడీపీ అభ్యర్థులు ఇతర పార్టీల గుర్తులపై పోటీ చేస్తున్నారు.

ఏకగ్రీవమైనవి ఇవే..

మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లోని 58వ డివిజన్‌లో రమాదేవి, రామగుండం కార్పొరేషన్‌లోని ఒకటో డివిజన్‌లో మాడిపల్లి విజయ, చౌటుప్పల్‌లో చింత ఉమామహేశ్వరి (17వవార్డు), హాలియాలో పిల్లి చంద్రకళ(10), ఎదులాపురంలో తమ్మినేని మంగతాయి(15), హుజూర్‌నగర్‌లో నాగలక్ష్మి(3), కోదాడలో దేవరపల్లి మల్లేశ్వరి(11), వై.కుసుమకుమారి(31), కట్టెబోయిన జ్యోతి(21), మెదక్‌లో గొడల మానస(32), వికారాబాద్‌లో అనంతరెడ్డి(1), యాదగిరిగుట్టలో గుండిపల్లి వాణి (10) కాంగ్రెస్ పార్టీ తరపున, అలంపూర్‌లో విక్రం(10), వికారాబాద్‌లో విజయలక్ష్మి (15వ వార్డు) బీఆర్ఎస్? తరఫున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పోటీలో 775 పోస్ట్ గ్రాడ్యుయేట్లు..

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయనున్న మొత్తం అభ్యర్థుల్లో 775 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉండడం గమనార్హం. గ్రాడ్యుయేట్లు 2,903 మంది, అండర్ గ్రాడ్యుయేట్లు 7,917 మంది కాగా, నిరక్షరాస్యులు 1,291 మంది.

# కోర్టుకు నరవణె

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10, భారత ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ (ఎంఎం) నరవణే రాసిన పుస్తకం ఇంకా అధికారికంగా విడుదల కాకముందే వివాదంలో చిక్కుకుంది. ఆయన రాసిన ఆత్మకథ 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంలోని అంశాలు, పీడీఎఫ్ కాపీలు చట్టవిరుద్ధంగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీనిపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.జనరల్ నరవణే తన అనుభవాలను పొందుపరుస్తూ రాసిన ఈ పుస్తకం ప్రస్తుతం రక్షణ శాఖ, విదేశాంగ శాఖల అనుమతి కోసం వేచి ఉంది. ఇందులో అగ్నిపథ్ స్కీమ్, తూర్పు లడఖ్‌లో చైనాతో ప్రతిష్టంభన వంటి కీలకమైన అంశాలను నరవణే ప్రస్తావించినట్లు సమాచారం. అయితే, పుస్తకం ప్రచురణకు నోచుకోకముందే, అందులోని కొన్ని భాగాలు ఫోటోల రూపంలోనూ, పీడీఎఫ్ రూపంలోనూ వాట్సాప్, టెలిగ్రామ్ లాంటి మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.అనుమతి లేకుండా, ప్రచురణ కాకుండానే పుస్తకాన్ని లీక్ చేయడం, కాపీరైట్ ఉల్లంఘన కింద పరిగణించబడుతుంది. ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందడంతో ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పుస్తకంలోని కంటెంట్‌ను ఎవరు లీక్ చేశారు? ఎక్కడి నుంచి ఇది మొదలైంది? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. చట్టవిరుద్ధంగా ఈ పుస్తకాన్ని ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. ఆమోదం కోసం వేచి ఉన్న ఈ పుస్తకానికి సంబంధించిన విషయాలను అనధికారికంగా ప్రసారం చేయడమనే ఉల్లంఘన ఇందులో ఉంది కాబట్టి ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాపీరైట్ ఉల్లంఘనలు, అక్రమ పంపిణీ లేదా ఇతర లోపాలు జరిగే అవకాశం దర్యాప్తులో భాగంగా ఉంటుంది. ఈ సమస్య సున్నితత్వం దృష్ట్యా, అధికారిక కేసు నమోదు చేసి, దర్యాప్తును ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగానికి అప్పగించారు. లీక్ మూలం, అందుకు గల బాధ్యులు, ఎలా బయటకు వచ్చిందో దర్యాప్తు బృందాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తాయి. దర్యాప్తు వెల్లడైన వివరాలు ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నరవణే పుస్తకంలో అంశాన్ని మొదటిసారి లేవనెత్తారు. స్పీకర్ అభ్యంతరం వ్యక్తంచేయడంతో ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. భారత్–చైనా సరిహద్దు వివాదానికి సంబంధించిన ప్రస్తావన అందులో ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశం తీవ్ర రాజకీయ దుమారానికి కేంద్ర బిందువుగా మారడంతో లోక్‌సభ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఈ క్రమంలో ఎనిమిది మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి లోక్‌సభ కార్యకలాపాలు సజావుగా సాగడం లేదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం లేకుండానే ఆమోదం పొందింది. అయితే, విపక్ష ఎంపీలు మోదీపై దాడి చేస్తారనే తనకు సమాచారం ఉండటంతో ప్రధానిని తాను సభకు రావద్దని కోరినట్టు స్పీకర్ ఓం బిర్లా చేసిన ప్రకటనపై విమర్శలు వెల్లువెత్తాయి.సాధారణంగా ఆర్మీ చీఫ్‌లు పదవీ విరమణ తర్వాత రాసే పుస్తకాలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశాలు బహిర్గతం కాకూడదనే ఉద్దేశంతో ఈ నిబంధన ఉంది. నరవణే పుస్తకంలో 2020 గల్వాన్ ఘర్షణలు, అగ్నిపథ్ నియామక ప్రక్రియపై సంచలన విషయాలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. ప్రభుత్వం దీనిని సమీక్షిస్తుండగానే, ఈ లీక్ జరగడం గమనార్హం.

# మున్సిపల్ ఎన్నికల తర్వాత పదవులు...

హైదరాబాద్, ఫిబ్రవరి 10, మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగియగానే కీలక పదవులను భర్తీతో పాటు క్యాబినెట్ విస్తరణ చేయనున్నారా? అంటే అవుననే టాక్ వినిపిస్తోంది. ఎన్నికలకు ముందు ఆ తర్వాత నేతలకు ఇచ్చిన హామీ ప్రకారం మంత్రి పదవులతో పాటు కార్పొరేషన్ పదవులు కట్టబెట్టాలని భావిస్తున్నారట. అయితే కొందరు తమకు పదవులు ఇవ్వకపోతే ఊరుకునేది లేదని అల్టిమేటం జారీ చేస్తున్నారట.ఇంకొందరు అయితే తమకు పదవులు ఇవ్వకపోయినా సరే, కానీ వేరే పార్టీ నుంచి వచ్చిన వలస నేతలకు పోస్టులు ఇవ్వొద్దని అగ్రనేతలకు తేల్చి చెబుతున్నారట. ఈ క్రమంలోనే మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగియగానే కాంగ్రెస్ పార్టీలో పదవుల జాతర స్టార్ట్ కానుందట.క్యాబినెట్‌లో మిగిలిన రెండు మంత్రి పదవులతో పాటు పలు కీలకమైన కార్పొరేషన్ పదవులను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోందట. మరోవైపు కులసంఘాల కార్పొరేషన్ ఛైర్మన్ల భర్తీపై కూడా ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే మున్సిపల్ ఎన్నికల కోడ్ రావడంతో పదవుల భర్తీకి బ్రేకులు పడ్డట్లు చెప్పుకుంటున్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే కీలక పదవులు భర్తీ చేస్తామని చెబుతున్నారట ప్రభుత్వ పెద్దలు.క్యాబినెట్ బెర్తుల కోసం హస్తం పార్టీలో హెవీ కాంపిటేషన్ ఉంది. సామాజిక వర్గాల వారీగా అమాత్య యోగం కోసం పోటీ పడుతున్నారు నేతలు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఇక రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి గట్టి పట్టుబడుతున్నారు.ఢిల్లీకి వెళ్లి పార్టీ అధిష్టానానికి విన్నవించుకున్నారు. ఇంతలో సీఎం రేవంత్ రెడ్డి పరిగి సభలో చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. మాజీ ఎంపీ రంజిత్ రెడ్డిని మున్సిపల్ శాఖ మంత్రిని చేస్తానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కొత్త చర్చకు దారితీశాయి. సీఎం రేవంత్ ఫ్లోలో అలా మాట్లాడారా లేక రంజిత్‌రెడ్డిని మంత్రి చేయబోతున్నారా అనేది డిస్కషన్ పాయింట్‌గా మారింది.ఈ క్రమంలోనే వలస వచ్చిన నేతలకు కాకుండా..పార్టీలో ముందు నుంచి ఉన్నవారికి గతంలో హామీ ఇచ్చినవారికి అమాత్య పదవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు నేతలు. ఇక బీసీ వర్గం నుంచి కూడా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ పేరు ప్రధానంగా చర్చకు వస్తున్నా..విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ వంటి వారు పోటీ పడుతున్నారు.ఎన్నికల కోడ్ ముగియగానే ప్రభుత్వం భర్తీ చేయాల్సిన కీలక పదవుల్లో మహిళా కమిషన్ ఒకటి. మహిళా కమిషన్ ఛైర్మన్‌తో పాటు సభ్యులుగా..కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కీలకంగా వ్యవహరించిన మహిళలకే అవకాశం ఇవ్వాలని హస్తం పార్టీ మహిళా నేతలు కోరుతున్నారు. అయితే ఈ పదవిని ప్రస్తుత జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మికి ఇవ్వబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది గ్రేటర్ మేయర్ విజయలక్ష్మీ పదవీకాలం ముగుస్తుంది. ఆ త్వరాత ఎన్నికల కోడ్ ముగియగానే విజయలక్ష్మీకి మహిళా కమిషన్ ఛైర్మన్ పదవి కట్టబెట్టబోతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై మహిళా కాంగ్రెస్ నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతగానో కష్టపడిన తమను కాదని వేరే పార్టీలో పదవులు అనుభవించిన వారికి మహిళా కమిషన్ లాంటి కీలక పదవి ఇవ్వడం సరైన పద్ధతి కాదని పార్టీ పెద్దల దగ్గర గోడును వెళ్లబోసుకున్నారట.వాస్తవానికి ఇప్పటివరకు పనిచేసిన మహిళా కమిషన్ ఛైర్మన్ కేవలం ఏడాదిన్నర మాత్రమే పదవిలో కొనసాగారు. కమిషన్ పదవీకాలం ఐదేళ్లు కాగా.. మూడున్నరేళ్లు ఈ పదవిలో ఉన్న సునితా లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో రాజీనామా చేశారు. దీంతో మిగిలిన ఏడాదిన్నర కోసమే నేరెళ్ల శారదకు అవకాశం ఇచ్చారు. ఏడాదిన్నర కాలం కూడా సమర్థవంతంగా పనిచేశారన్న పేరు కూడా తెచ్చుకున్నారు. దీంతో ఆమెకు ఎక్స్‌టెన్షన్ ఖాయమనే అంతా భావించారు.అయితే కేకే కూతురు, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి పదవీకాలం ఈ నెల ముగుస్తుండడంతో ఆమెకు మహిళా కమిషన్ ఛైర్మన్ పోస్టు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసమే ఇప్పటివరకు శారదకు ఎక్స్ టెన్షన్ ఇవ్వకుండా..కొత్త వారితో భర్తీ చేయకుండా ఆపారన్న టాక్ నడుస్తోంది. దీనిపై ఒరిజినల్ కాంగ్రెస్ మహిళా నేతల్లో అసహనం వ్యక్తం అవుతోంది.డిమాండ్లు, అభ్యంతరాలు, ఆశావహులు ఈక్వేషన్స్ ఎలా ఉన్నా..మార్చి ఫస్ట్ వీక్‌లో కాంగ్రెస్ పార్టీలో పదవుల పందేరం మాత్రం పక్కా అన్న టాక్ వినిపిస్తోంది. అయితే పదవుల పందేరంలో ఒరిజినల్ కాంగ్రెస్ వర్సెస్ కొత్త కాంగ్రెస్ నేతల్లో ఎవరి ఆశలు నెరవేరుతాయో చూడాలి మరి.

# తగలబడిందా... తగలబెట్టేరా

హైదరాబాద్, ఫిబ్రవరి 10, హైదరాబాద్‌లోని స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో సంభవించిన భారీ అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాలు అగ్నికి ఆహుతయినట్లుగా తెలుస్తోంది. సుమారు రెండు గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఉదయం వేళ కార్యాలయం పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో, అకస్మాత్తుగా కంప్యూటర్ ల్యాబ్ విభాగం నుంచి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ఇతర విభాగాలకు వ్యాపించాయి. దట్టమైన పొగలు భవనం మొత్తాన్ని కమ్మేశాయి. ఈ ప్రమాద సమయంలో లోపల ఉన్న ఒక వ్యక్తికి గాయాలు కాగా, వెంటనే అప్రమత్తమైన సహచరులు బాధితుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాద వార్త తెలియగానే డీసీపీ శిల్పవల్లి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక యంత్రాలు మంటలను ఆర్పే ప్రక్రియను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ వంటి అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే చోట అగ్నిప్రమాదం జరగడంపై ఆమె అధికారులను ఆరా తీశారు. అసలు మంటలు ఎలా మొదలయ్యాయి? షార్ట్ సర్క్యూట్ కారణమా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో ప్రాథమిక విచారణ చేపట్టారు.ఈ ప్రమాదంలో అత్యంత ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే.. కంప్యూటర్ ల్యాబ్‌లో ఉన్న అనేక కీలకమైన కేసుల డేటా , భౌతిక పత్రాలు కాలి బూడిదయ్యాయి. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పలు నేరాలకు సంబంధించిన డిజిటల్ సాక్ష్యాలు, ఫోరెన్సిక్ విశ్లేషణలు ఈ ల్యాబ్‌లోనే ఉన్నాయి. సాక్ష్యాలు బుగ్గిపాలు కావడంతో ఆయా కేసుల విచారణపై ఈ ప్రభావం పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సాధారణంగా ఫోరెన్సిక్ కార్యాలయాల్లో ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు పకడ్బందీగా ఉంటాయి. అలాంటిది కంప్యూటర్ ల్యాబ్‌లోనే మంటలు రావడం, కీలక పత్రాలు ఉన్న చోటే ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా కావాలనే సాక్ష్యాలను రూపుమాపడానికి ఈ పని చేశారా? అనే కుట్ర కోణం పై పోలీసులు దృష్టి సారించారు. ల్యాబ్‌లోని సీసీటీవీ విజువల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు.క్లూస్ టీమ్ , ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్నారు. కంప్యూటర్లలోని హార్డ్ డిస్క్‌లు ఎంతవరకు దెబ్బతిన్నాయి, వాటి నుంచి డేటాను రికవరీ చేసే అవకాశం ఉందా అనే దానిపై ఐటీ నిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫోరెన్సిక్ నివేదికలు తారుమారైతే నేరస్తులకు మేలు జరుగుతుందనే కోణంలో పోలీసులు అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు.

# తగ్గిన చికెన్, మటన్ ధరలు

హైదరాబాద్, ఫిబ్రవరి 10, పండుగల సీజన్, మేడారం జాతర ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు కొండెక్కగా.. ఇప్పుడు పండుగ సీజన్ ముగియడంతో ధరలు ఇప్పుడిప్పుడే దిగొస్తున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో క్రిస్మస్ ఉండటం, ఆ తర్వాత కొత్త ఏడాది జనవరిలో సంక్రాంతి పండుగ రావడం, మేడారం జాతర జరగడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. కేజీ చికెన్ రూ.350 వరకు తెలుగు రాష్ట్రాల్లో చేరుకుంది. కానీ ఇప్పుడు మెల్లమెల్లగా ధరలు తగ్గుతుండటంతో నాన్ వెజ్ ప్రియులు ఉపశమనం పొందుతున్నారు. జనవరి 8న సండే కావడంతో చికెన్‌కు డిమాండ్ ఉంటుంది. సెలవు కాకడంతో చికెన్ తినేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తారు. ధరలు తగ్గడం వీరికి కాస్త రిలీఫ్ ఇచ్చిందిప్రస్తుతం కేజీ స్కిన్‌లెస్ చికెన్ ధర రూ. 240 నుంచి రూ.250 వరకు పలుకుతోంది. ఇక డ్రెస్డ్ చికెన్ కిలో రూ.220 నుంచి రూ.230 వరకు ఉండగా.. లైవ్ చికెన్ రూ.118 నుంచి రూ.120కే లభిస్తుంది. మేడారం జాతర సమయంలో డిమాండ్ కారణంగా స్కిన్‌లెస్ చికెన్ రూ.350నుంచి రూ.380 వరకు కూడా వ్యాపారులు విక్రయించారు. ఇక డ్రెస్డ్ చికెన్‌ను రూ.350కు, లైవ్ కోడిని రూ.200 వరకు విక్రయించారు. జాతర ముగిసిన తర్వాత చికెన్ ధరలు ధమాల్ అంటూ పడిపోయాయి. వారం రోజుల వ్యవధిలోనే రూ.100 తగ్గడంతో నాన్‌వెజ్ ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పండుగ సీజన్ ముగియడంతో కోళ్లకు డిమాండ్ పడిపోయిందని, ధరలు తగ్గడానికి ఇదే కారణమని వ్యాపారుల చెబుతున్నారు. అలాగే కోళ్ల ఉత్పత్తి కూడా పెరగడం వల్ల ధరలు పడిపోతున్నాయని అంటున్నారు.తెలుగు రాష్ట్రాల్లో కోళ్ల ఫామ్స్‌లో ఉత్పత్తి బాగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో డిమాండ్ లేకపోవడంతో తక్కువ ధరలకే విక్రయిస్తున్నారు. ఇక చికెన్ ధరలతో పాటు కోడిగుడ్ల ధరలు కూడా భారీగా పెరిగాయి. గత నెలలో ఏకంగా ఒక్కో కోడిగుడ్డు ధర రూ.10కు చేరుకుంది. రిటైల్ షాపుల్లో రూ.10కి విక్రయించారు. ఇప్పుడు కేవలం ఒక్కో గుడ్డు రూ.6కే షాపుల్లో అమ్ముతున్నారు. కోడిగుడ్ల ధరలు కూడా ఒకేసారి కుప్పకూలాయి. దీంతో సామాన్యులకు ధరల భారం తగ్గిందని చెప్పవచ్చు. ఇవాళ అసలే సండే కారణంతో చికెన్ షాపుల ముందు జనం క్యూ కడుతున్నారు. చికెన్ కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్నారు. దీంతో మాంసం దుకాణాలన్నీ కస్టమర్లతో కిటకిటలాడుతున్నాయి. అటు మటన్ ధరలు కూడా పండుగ తర్వాత తగ్గాయి. పండుగ సమయంలో రూ.1500 వరకు పలకగా.. ఇప్పుడు రూ.800కే లభిస్తోంది.

## అర్ధరాత్రి సెల్ ఫోన్ స్నాచింగ్

రంగారెడ్డి ఇంటిముందు బైక్ ఆపి పార్క్ చేస్తున్న సమయంలో వేరే బైక్ పై అతనివద్దకు ఇద్దరు దొంగలు వచ్చారు. ముందు బండి నడిపే దొంగ బైక్ నిలపగానే.. వెంటనే వెనుక కూర్చున్న దొంగ ఒకసారిగా యువకుడి చేతిలో ఫోన్ లాగేసాడు. రెప్పపాటులో అక్కడినుండి ఉడాయించారు. బి.ఎన్. రెడ్డి వినాయక హిల్స్ రోడ్డు నంబర్ మూడులో సోమవారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటల సమయంలో ఈ స్నాచింగ్ ఘటన జరిగినట్లు సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో నమోదు అయ్యాయి. హఠాత్పరిణమంతో కొన్ని క్షణాలపాటు నిస్తేజంగా ఉండిపోయిన యువకుడు వెంటనే తన బైక్ పై వారిని వెంబడించడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం కనిపించలేదు... అర్ధరాత్రి కావడంతో వీధులు నిర్మానుష్యంగా ఉండడంతో దొంగలు వేగంగా ఉడాయించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య

నారాయణపేట కాంగ్రెస్ నాయకుల వేధింపులు భరించలేక బీజేపీ మున్సిపల్ ఎన్నికల అభ్యర్థి ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలోని 6వ వార్డు బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఎరుకలి మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నాడు. నిన్ను జైలులో వేపిస్తాం అంటూ కాంగ్రెస్ నాయకుల బెదిరింపు, ఫోన్లో మెసేజీలు పెట్టి భయపెడుతున్నారు అంటూ కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేసారు. సోమవారం అర్ధరాత్రి మహదేవప్ప ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

# కొత్తజిల్లాల ఆశలపై నీళ్లు

వరంగల్, ఫిబ్రవరి 10, తెలంగాణలో జిల్లాల పునర్విభజన, ప్రస్తుత జిల్లాల భవిష్యత్తుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోబోతోందనే ఉత్కంఠకు సీఎం తెరదించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఏ ఒక్క జిల్లాను కూడా రద్దు చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా భూపాలపల్లి జిల్లా రద్దు అవుతుందనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, సెంటిమెంట్లు, ఆయన లక్కీ నంబర్ ఆధారంగానే జిల్లాల విభజన చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ విమర్శిస్తూ వస్తోంది. పరిపాలనా సౌలభ్యం కంటే రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా జిల్లాల ఏర్పాటు జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా ఉన్న జిల్లాలను తొలగించడం కంటే, ఉన్నవాటిని పటిష్టం చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న సీఎం, అక్కడి బహిరంగ సభలో జిల్లా ఉనికిపై భరోసా ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎంతో గొప్ప చరిత్ర ఉందని, భూపాలపల్లి ఒక చిన్న కుగ్రామంగా ఉన్న దశ నుంచి నేడు మున్సిపాలిటీగా, జిల్లా కేంద్రంగా ఎదగడం వెనుక ఎందరో కృషి ఉందని రేవంత్ రెడ్డి కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు భూపాలపల్లిని మండల కేంద్రంగా మార్చడం ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధికి బీజం పడిందని ఆయన గుర్తు చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి పునాది ఇక్కడే పడిందని, ఈ ప్రాంత అభివృద్ధిలో సింగరేణి కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని ఆయన ప్రశంసించారు.జిల్లాల పునర్విభజన లేదా మార్పులపై భవిష్యత్తులో ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే, అది ఏకపక్షంగా ఉండదని సీఎం తేల్చిచెప్పారు. ప్రజల అభిప్రాయాలను సేకరించిన తర్వాత, అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి, ప్రతిపక్షాల సూచనలు తీసుకున్న తర్వాతే ముందుకెళ్తామని ప్రకటించారు. రహస్య నిర్ణయాలు లేదా రాజకీయ కుట్రలకు తమ ప్రభుత్వంలో తావులేదని ఆయన కుండబద్దలు కొట్టారు.ప్రభుత్వంపై బురదజల్లేందుకు కొంతమంది కావాలనే జిల్లాల రద్దుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం ఇలాంటి విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మెడికల్ బోర్డు విషయంలో కొందరు చేస్తున్న చిల్లర రాజకీయాలను తిప్పికొడతామని, కార్మికుల వల్లే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని ఆయన కృతజ్ఞత చాటుకున్నారు. అసత్య ప్రచారాలు చేసే వారిని మోకాళ్లపై కూర్చోబెడతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే శక్తులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనతో జిల్లాల భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధత వీడిపోయింది. పాలనలో పారదర్శకత, ప్రజాస్వామ్యబద్ధమైన చర్చల ద్వారానే ఏ నిర్ణయమైనా ఉంటుందని చెప్పడం ద్వారా ఆయన ప్రజల్లో విశ్వాసాన్ని నింపారు. భూపాలపల్లి జిల్లా ఉనికిపై ఆయన ఇచ్చిన హామీ ఆ ప్రాంత ప్రజలకు పెద్ద ఊరటనిచ్చింది.

## పోలింగ్ సిబ్బంది కి పోలింగ్ సామాగ్రి పంపిణీ

ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల డిస్టిబ్యూషన్ కేంద్రం లో పోలింగ్ సిబ్బంది కి అధికారులు పోలింగ్ సామాగ్రిని పంపిణీ చేశారు.మున్సిపల్ ఎన్నికలకు పోలింగ్ స్టేషన్లు 67 కాగా పోలింగ్ సిబ్బందిని 664 మందిని ఎన్నికల అధికారులు నియమించారు.ఏదులాపురం లో మొత్తం 32 వార్డు లు ఉండగా ఒక వార్డు ఏకగ్రీవం అయ్యింది.దీంతో 31 వార్డు లకు ఎన్నికలు జరగనున్నాయి.మున్సిపల్ ఎన్నికల్లో 109 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా మొత్తం 43,911 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు

# బండి వ్యూహం ఫలించేనా

కరీంనగర్ ఫిబ్రవరి 10, తెలంగాణలో. ప్రచారం హోరాహోరీగా ముగిసింది ఇక 66 డివిజన్లు ఉన్న ఖరీంనగర్‌లో ఈసారి కాషాయ జెండా ఎగురవేయాలని ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫోకస్ పెట్టారు. ప్రత్యేక శైలిలో ప్రచారంతో ముందుకు సాగుతున్నారు. డివిజన్‌ల వారీగా స్ట్రీట్ కార్నర్ సమావేశాలు ఏర్పాటు చేస్తూ, ప్రజలతో నేరుగా సంబంధం పెంచుకుంటున్నారు. అవినీతి దూరం, నగరాభివృద్ధి హామీలతో ఓటర్లలో నమ్మకాన్ని నింపుతూ, పోటీని తీవ్రతరం చేస్తున్నారు.ప్రతి డివిజన్‌లో బండి సంజయ్ నిర్వహిస్తున్న చిన్న సమావేశాలు ప్రచారానికి కొత్తగా ఉంటున్నాయి. రోడ్డు పక్కనే జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రజల సమస్యలను విని, తమ అభ్యర్థులను పరిచయం చేస్తున్నారు. ఇది పార్టీకి క్షేత్ర స్థాయిలో బలోపేతాన్ని తీసుకువస్తోంది. సాధారణ ప్రచారాలకు భిన్నంగా, ఈ విధానం ఓటర్లలో సానుకూలతను పెంచుతోందిగెలిచాక అవినీతికి పాల్పడమని అభ్యర్థులు ప్రజల సాక్షిగా ప్రమాణం చేయించడం సంజయ్ ప్రత్యేక ఎత్తు. ఈ చర్య ఓటర్లలో పారదర్శకత, జవాబుదారీతనం భావాలను రేకెత్తిస్తోంది. ప్రజల ముందు ఇలాంటి ప్రతిజ్ఞలు రాజకీయ విమర్శలకు బలమైన జవాబుగా మారాయి. ఇది పోటీ అభ్యర్థులకు సవాలుగా నిలిచి, బీజేపీ అజెండాను బలపరుస్తోంది.కేంద్ర ప్రభుత్వ నిధులతో నగరాన్ని అభివృద్ధి చేస్తామని స్పష్టమైన హామీ ఇస్తున్నారు. ఇది స్థానిక సమస్యలైన మౌలిక సదుపాయాలు, పరిశీలన, రోడ్లు వంటి అంశాలపై దృష్టి పెడుతోంది. ప్రజలతో మమేకమైన వాతావరణం సృష్టించి, ఈ హామీలను వాస్తవికంగా చూపిస్తున్నారు. ఇది ఓటర్లలో ఆశలు నింపుతూ, పార్టీకి ఆదాయం తీసుకువస్తుందని అంచనా.సంజయ్ వ్యూహం కరీంనగర్ ఎన్నికల్లో పోటీని మరింత ఉత్కంఠ పెంచింది. అవినీతి వ్యతిరేక చిత్రణ, అభివృద్ధిపై ఫోకస్ బీజేపీ అభ్యర్థులకు ప్లస్‌గా మారుతున్నాయి. ప్రత్యర్థి పార్టీలు ఈ దూకుడుకు సమాధానాలు తీసుకోవాల్సి వచ్చింది. ఫలితాలు బీజేపీ క్షేత్ర స్థాయి బలాన్ని, సంజయ్ నాయకత్వాన్ని పరీక్షిస్తాయి.

# కోట్లు కురిపిస్తున్న మేడారం హుండీలు

వరంగల్ ఫిబ్రవరి 10, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఇటీవల పూర్తయిన సంగతి తెలిసిందే. దాదాపు రెండున్నర కోట్ల మంది భక్తులు వచ్చి.. అమ్మవార్లను దర్శించుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది.

ఇక మేడారంలో ఏర్పాటు చేసిన హుండీలను హనుమకొండకు తీసుకువచ్చి.. టీటీడీ కల్యాణ మండపంలో గత గురువారం రోజున లెక్కింపు ప్రక్రియను రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు ప్రారంభించారు. ఇవాళ్టికి గత 5 రోజులుగా హుండీలను లెక్కించే పనిలో దేవాదాయ శాఖ సిబ్బంది తలమునకలై ఉన్నారు. ఇక ఐదోరోజు 163 హుండీలను లెక్కించిన అధికారులు ఇప్పటివరకు వచ్చిన ఆదాయం వివరాలను వెల్లడించారు. ఒక్కరోజే 163 హుండీలను లెక్కించగా.. అందులో మొత్తం రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు గత 5 రోజుల్లో మొత్తం 788 హుండీలను లెక్కించినట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో మొత్తంగా ఇప్పటివరకు రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఇందులో మన దేశ కరెన్సీతోపాటు విదేశాలకు చెందిన నోట్లు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు దాదాపు 18 దేశాలకు చెందిన నోట్లు వచ్చాయని వెల్లడించారు.మిగిలిన హుండీల లెక్కింపు ప్రక్రియ కూడా ముమ్మరంగా సాగుతోందని ఆలయ సిబ్బంది పేర్కొన్నారు. లెక్కింపు పూర్తి కావడానికి మరో రెండ్రోజుల సమయం పట్టవచ్చని సిబ్బంది అంచనా వేశారు. ఇప్పటివరకు డబ్బులు మాత్రమే లెక్కిస్తుండగా.. ఈ నోట్లు మొత్తం లెక్కించడం పూర్తి అయిన తర్వాత బంగారం, వెండి వస్తువులను వాటి బరువు ఆధారంగా విలువను నిర్ధరించనున్నట్లు వెల్లడించారు.మరోవైపు.. మేడారం మహాజాతరలో ఏర్పాటు చేసిన హుండీల ద్వారా వచ్చిన మొత్తం ఆదాయంలో 33 శాతాన్ని మేడారం పూజారులకు అందించనున్నారు. ఇక గతంలో నిర్వహించిన మహాజాతరలో సుమారు రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే.. ఈసారి భారీగా పెరగనున్నట్లు దేవాదాయ శాఖ అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. గతంతో పోల్చితే 3 రెట్లు అధికంగా హుండీ ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.ఇక మొత్తం హుండీల లెక్కింపునకు దాదాపు 10 రోజులకు పైనే సమయం పడుతుందని పేర్కొంటున్నారు. హుండీల్లో డబ్బులు, బంగారం, వెండి, ఇతర ఆభరణాలు, విదేశీ కరెన్సీ లెక్కింపు ఇంతా పూర్తి అయిన తర్వాత మొత్తం ఈసారి ఆదాయం ఎంత వచ్చింది అనేదానిపై అధికారిక ప్రకటన చేయనున్నారు.ఈ మహాజాతరలో భాగంగా గద్దెల ప్రాంగణంలో మొత్తం 828 హుండీలను ఏర్పాటు చేశారు. వాటిలో 780 ఇనుప హుండీలు కాగా.. 45 వస్త్ర హుండీలు, 3 బియ్యం హుండీలు ఉన్నట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఇక హుండీల్లో పాత రూ.500, రూ.1000 నోట్లు కూడా వస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు.. మరికొందరు భక్తులు పేపర్లు, నోట్లపై తమ కోరికలను రాసి వాటిని తీర్చాలంటూ సమ్మక్క సారలమ్మలను వేడుకున్నారు.

# నా చావుకు భార్య, అత్తా, మామలతో పాటు రమణారెడ్డి అనే వ్యక్తి కారణం సాఫ్ట్వేర్ ఇంజనీర్ సీతారాం రెడ్డి.



నా చావుకు భార్య, అత్తా, మామలే కారణమంటూ ఓ వ్యక్తి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన లేక్‌పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేకరు..

మార్కాపురానికి చెందిన సీతారాంరెడ్డి (36), రేణుక దంపతులు బాచుపల్లిలో నివాసం ఉంటున్నారు. ఇద్దరూ సాఫ్ట్ వేర్ ఇంజినీర్లు. గతంలో భార్య రేణుక ఇన్‌స్ట్రాగాంలో పరిచయమైన వ్యక్తితో ఇంట్లో నుంచి వెళ్లిపోయి కొద్దిరోజుల తరువాత వచ్చింది. అప్పటి నుంచి ఆమె ఇంట్లోనే ఉంటోంది. అయితే గత జనవరి నెల 24 న మళ్లీ అదృశ్యమైంది.భార్య కనిపించకుండా పోవడంతో ఆమె తల్లిదండ్రులు బాచుపల్లికి వచ్చి ఇక్కడికే ఉంటున్నారు.

అత్తామామలు ఆదివారం పిల్లలను తీసుకుని సొంత ఊరు నంద్యాలకు వెళ్లిపోయారు. తీవ్ర మనస్తాపానికి గురైన సీతారాంరెడ్డి ఆదివారం సాయంత్రం హుస్సేన్ సాగర్‌లో దూకాడు. సోమవారం ఉదయం నుంచి హైడ్రా, లేక్ పోలీసులు గాలించగా సాయంత్రం మృతదేహం బయటపడింది. తన చావుకు భార్య, అత్తా, మామలతో పాటు రమణారెడ్డి అనే వ్యక్తి కారణం అని ఫోన్‌లో స్టేటస్ పెట్టుకున్నాడు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాందీమార్చురీకి తరలించారు.

## మునిసిపల్ ఎన్నికలపై ఈసీ వీడియో కాన్ఫరెన్స్

హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్ల మీద ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని దేవి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్లు, పోలీస్ డిపార్ట్మెంట్ తో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ సిబ్బంది నియామకం, ట్రైనింగ్, వెబ్ క్యాస్టింగ్, బందో బస్తు మీద సమీక్ష నిర్వహించారు. బుధవారం రేపు 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగనున్నాయి. 2996 వార్డులకు గాను 14 వార్డులు ఏకగ్రీవం కావడంతో 2982 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ అదనపు బలగాలను మోహరించారు.

## మదీనగూడ మజీద్ బండ దగ్గర హైడ్రా ఆపరేషన్

హైదరాబాద్ కొండాపూర్లో రూ. 700 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడింది. కొండాపూర్ లోని జంగంకుంట ఆక్రమణలు పై హైడ్రా సీరియస్ యింది. శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం – మదీనగూడ మజీద్ బండ దగ్గర హైడ్రా ఆపరేషన్ నిర్వహించింది. అక్రమనదారులు నాలుగు ఎకరాల జంగంకుంట ను మాయం చేసారు. సర్వేనెంబర్ 134 లో మట్టి పోసి కుంటను చదును చేసారు. ప్లాట్లుగా చేసి అమ్మకానికి సిద్ధమైయ్యారు. రెవెన్యూ అధికారులు వారిపై పై కేసులు పెట్టారు. జంగంకుంట లో రెవెన్యూ అధికారులతో కలసి జాయింట్ ఇన్స్పెక్షన్ చేసిన హైడ్రా అధికారులు పోలీసుల సహకారంతో చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసారు.

### హెచ్సియూ లో లాప్ ట్యాప్ ల చోరీ

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోని సి.ఆర్.రావు ఇన్స్టిట్యూట్లో జరిగిన భారీ చోరీ చోటు చేసుకుంది. యూనివర్సిటీలోని సి.ఆర్.రావు ఇన్స్టిట్యూట్ లో 25 లక్షలు విలువైన 50 ల్యాప్ టాప్ లు మాయం అయ్యాయి. క్లాస్ రూమ్ కిటికీ గ్రిల్స్ను తొలగించి లోపలికి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తులు, ల్యాప్టాప్లను కారులో తరలించినట్లు సిసిటివి ఫుటేజ్ లో గుర్తించారు. సోమవారం సిబ్బంది క్లాస్ రూముకు వెళ్లి చూడగా,కిటికీలు ఊడదీసి ఉండటం మరియు కంప్యూటర్లు కనిపించకపోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. యూనివర్సిటీ సెక్యూరిటీ అధికారులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేసారు.

# ఎన్నికల కోడ్ ఉలఘించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేను అడ్డుకున్న ప్రజలు

కామారెడ్డి ప్రచార సమయం ముగిసిన తర్వాత డబ్బులు, మద్యం పంచుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావును స్థానిక ఓటర్లు అడ్డుకున్నారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీలోని ఒక వార్డులో, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఎమ్మెల్యే తోల ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీ చేసారని ఆరోపించారు. ప్రలోభాలకు గురిచేస్తున్న ఎమ్మెల్యేను రెడ్ హ్యాండెడ్గా అడ్డుకున్నారు. అక్కడినుండి ఓటర్లు, బీఆర్ఎస్ శ్రేణులు పంపించివేసారు. కాంగ్రెస్ నాయకులు కళ్లముందే ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నా పోలీసులు పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేసారు.

# గులాబీ పరువు నిలిచేనా

హైదరాబాద్ ఫిబ్రవరి 10, అధికారం ఉన్నప్పుడు ఏదైనా చేయవచ్చు. సాధ్యం కానిది కాళ్ల దగ్గరికి తెచ్చుకోవచ్చు. 2020 పురపాలక ఎన్నికల్లో గులాబీ పార్టీ ఇలానే చేసింది. అధికారాన్ని ఉపయోగించింది. అంగ బలాన్ని ప్రయోగించింది. అర్థాన్ని వాడింది. తద్వారా తిరుగులేని శక్తిగా ఆవిర్భవించింది.2020లో జనవరి నెలలో పురపాలక ఎన్నికలు జరిగాయి. నాటి ఎన్నికల్లో 120 మున్సిపాలిటీలు.. 9 కార్పొరేషన్లకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. నాటి ఎన్నికలలో గులాబీ పార్టీ సత్తా చూపించింది. 120 మున్సిపాలిటీలలో ఏకంగా 110 కంటే ఎక్కువ మునిసిపాలిటీలను తన ఖాతాలో వేసుకుంది. 9 కి 9 కార్పొరేషన్లను గులాబీమయం చేసింది. మొత్తం 2727 వార్డులలో దాదాపు 70 శాతానికి దగ్గరగా స్థానాలను గులాబీ పార్టీ గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ 500 వార్డులలో సత్తా చూపిస్తే.. బిజెపి 200 వార్డులలో తన సామర్థ్యాన్ని ప్రదర్శించింది.2020 పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యంత దయనీయమైన స్థితిలో ఉండేది. చాలా ప్రాంతాలలో రెండవ స్థానంలో నిలిచినప్పటికీ మునిసిపల్ పీఠాలను అందుకోలేకపోయింది. నాడు హుజుర్ నగర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలో గులాబీ పార్టీ విజయం సాధించిన తర్వాత.. పురపాలక ఎన్నికలు వచ్చాయి. దీంతో గులాబీ పార్టీ సహజంగానే జోష్ మీద పాల్గొంది. నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన కంచుకోటలను కూడా కాపాడుకోలేకపోయింది. పట్టణ ప్రాంతాలలో బిజెపి సత్తా చూపించినప్పటికీ.. అది కొన్ని ప్రాంతాలలో మాత్రమే ప్రభావం చూపించింది. 2020 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు సత్తా చూపించడం విశేషం.నాటి ఎన్నికల్లో గులాబీ పార్టీ కొత్త మున్సిపల్ చట్టాన్ని తీసుకొచ్చింది. దానిని ప్రతిపక్షాలు తప్పుపట్టాయి. అయినప్పటికీ అధికారాన్ని ఉపయోగించి గులాబీ పార్టీ ఇష్టానుసారంగా రిజర్వేషన్లను ఖరారు చేసింది. వాటి ద్వారానే ఎన్నికలు జరిపింది. ఇక ఓటర్ల జాబితా గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.

ఇలా అన్ని రకాలుగా అధికార దర్పాన్ని ప్రయోగించి గులాబీ పార్టీ నాటి ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు సాధించింది.

ఇక ఇప్పుడు గులాబీ పార్టీ పరిస్థితి మరో విధంగా ఉంది. అధికార పార్టీగా కాంగ్రెస్ కొనసాగుతోంది.

అప్పటి పురపాలక ఎన్నికల్లో కేటీఆర్, హరీష్ రావు ప్రచారం నిర్వహించారు. ఇప్పుడు వారిద్దరూ కనిపించడం లేదు. అందువల్లే గులాబీ పార్టీ ఆత్మ రక్షణ ధోరణిలో పడిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# కడప జిల్లాలో టూరిస్టు బస్సు బోల్తా .. తప్పిన పెనుప్రమాదం



కడప జిల్లాలో పెనుప్రమాదం తప్పింది. 40 మంది భక్తులతో వెళుతున్న టూరిస్టు బస్సు జమ్మలమడుగు – కన్యతీర్థం ప్రధాన రహదారిపై ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో తొమ్మిది మంది భక్తులు గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నుంచి ప్రైవేటు బస్సులో 40 మంది భక్తులు జమ్మలమడుగు మండలం కన్యతీర్థం దర్శనానికి వెళ్లారు అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని ఆలూరు రంగనాయకుల కోనకు బయలుదేరారు. ఈ క్రమంలో కొత్తగుంటపల్లె సమీపంలోని మలుపు వద్ద బస్సు స్టీరింగ్ అకస్మాత్తుగా పనిచేయకపోవడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది.

ఈ ప్రమాదంలో రైల్వేకోడూరుకు చెందిన తొమ్మిది మంది భక్తులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ప్రాణపాయం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు

# స్విమ్స్- స్టాఫ్ నర్సు హరిత మృతికి సంతాపం తెలిపిన స్విమ్స్ ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్

తిరుపతి శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) హాస్పిటల్ సి.టి. సర్జరీ విభాగం లో స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న ఎం. హరిత గారు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వేలూరు సి.ఎం.సి. హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని మంగళవారం ఉదయం పాత డైరెక్టర్ కార్యాలయ ఆవరణం నందు శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని నిర్వహించారు.


స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా? ఆర్.వి. కుమార్ హరిత చిత్రపటానికి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్విమ్స్ తో 10 ఏళ్లుగా మెడిసిన్, రేడియేషన్ ఆంకాలజీల విభాగాలలో కూడా నర్సుగా సేవలు అందించారు. ప్రస్తుతం సి.టి. సర్జరీ విభాగంలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నారు. కోవిడ్ సమయంలో కూడా విశిష్ట సేవలు అందించారని ఆమె సేవలను కొనియాడారు. హరిత మృతికి సంతాపం తెలిపుతూ స్విమ్స్ సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# వాటర్ బోర్డ్ ఫిల్టరేషన్ ప్లాంట్ అధికారులపై రైతుల మండిపాటు

హైదరాబాద్ అంబర్పేట్లోని వాటర్ బోర్డ్ ఫిల్టరేషన్ ప్లాంట్ అధికారుల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా స్థానిక రైతులు, భూ యజమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత సంవత్సరం తమ అనుమతి లేకుండానే పంట పొలాల మీదుగా పైప్లైన్లు వేసి తమకు తీవ్ర నష్టం కలిగించారని వారు ఆరోపించారు. ఈ అంశంపై ఇప్పటికే హైకోర్టులో కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు.వాటర్ బోర్డ్ వర్క్స్ కాంపౌండ్ వాల్ సమీపంలోని పంట పొలాల్లోకి యథేచ్ఛగా నీటిని వదిలేయడంతో పొలాలు పూర్తిగా నీట మునిగి పంటలు నాశనం అవుతున్నాయని రైతులు వాపోయారు. అంతేకాదు, పశుగ్రాసం కోసం పొలాలకు వచ్చే రైతుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తమ జీవనాధారం అయిన వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడుతోందని, పంటలు కోతకు గురయ్యే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పంట పొలాల మీదుగా వేసిన పైప్లైన్ను తొలగించి, జరిగిన నష్టానికి తగిన పరిహారం చెల్లించాలని వాటర్ బోర్డ్ అధికారులను డిమాండ్ చేశారు. తక్షణమే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

# తెలుగువారికి తరిగిపోని మధురామృతం అందించిన గానగంధర్వుడు ఘంటసాల

# -నేడు ఘంటసాల వర్ధంతి



ఘంటసాల గానం వినగానే తెలుగువారి మది ఆనందసాగరంలో మునకలు వేస్తుంది. ఈ నాటికీ ఘంటసాల పాటతోనే తెలుగునాట ఎన్నో కోవెలలు మేలుకొలుపు పాడుతూ ఉన్నాయి. మాస్టారు గానం చేసిన భక్తిగీతాలు, భగవద్గీత శ్లోకాలు తెలుగువారికి సుపరిచితాలు. ఆ గళంలో జాలువారిన ప్రతీపదం అమృతమయం అవుతుందని తెలుగువారి విశ్వాసం. ఘంటసాల గాత్రం వెలువరించిన గీతాలు ఈ నాటికీ పరవశింప చేస్తూనే ఉన్నాయి... ముఖ్యంగా ఆయన పాడిన భక్తి గీతాలు ఎందరిలోనో ఆధ్యాత్మిక భావం నెలకొల్పుతున్నాయి. ఘంటశాల వెంకటేశ్వరరావు 1922 డిశంబర్ 4న గుడివాడ మండలం చౌటపల్లిలో ఘంటశాల సూర్యనారాయణ, రత్నమ్మ దంపతులకు జన్మించారు. చిన్నప్పటి నుండే భజనలు, కీర్తనలు తండ్రి వెంట పాడుతూ ఉండేవారు. తండ్రి ఆశయం నెరవేర్చాలనే లక్ష్యంతో సంగీత గురుకులంలో చేరారు. అక్కడి కట్టుబాట్లను తట్టుకోలేక తిరిగి సొంత ఊరికి వచ్చేశారు. తెలిసిన కొందరు సంగీత విద్వాంసుల ఇళ్ళలో పని చేస్తూ సంగీతం అభ్యసించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పని ఒత్తిడి పెరగడంతో ఆయన సంగీత కళాశాలలో చేరాలని అనుకున్నారు. 40 రూపాయలు విలువ చేసే ఉంగరాన్ని కేవలం రూ.8రూపాయలకు అమ్మి ఆంధ్రలో ఏకైక సంగీత కళాశాలలో చేరారు. అక్కడ ఉంటూ రోజుకు ఒక్కపూట భోజనం చేస్తూ అద్దె కట్టేందుకు డబ్బు లేక ఆ ఊళ్ళో ఉన్న ఎల్లమ్మ దేవాలయంలో తలదాచుకునేవారు. తరచూ ఆ గుడికి వచ్చే పట్రాయని సీతారామశాస్త్రి ఘంటశాల గురించి తెలుసుకుని తన ఇంట ఉచితంగా సంగీత శిక్షణనివ్వడానికి అంగీకరించారు. శాస్త్రి చాలా పేదవారు కావడంతో భోజన వసతి కల్పించడానికి చాలా ఇబ్బందులు పడేవారు. 1942లో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండు సంవత్సరాలు అలీపూర్ జైల్లో జైలు శిక్ష అనుభవించారు. 1944 మార్చి4న సావిత్రమ్మతో పెళ్ళి జరిగింది. తన పెళ్ళిలో తనే కచేరి చేసి అందరినీ ఆశ్చర్యచకితులను చేశారు ఘంటసాల. ఘంటశాలలోని గాన సామర్థ్యాన్ని గుర్తించిన సముద్రాల నాటి మద్రాసులోని రేణుకా ఫిలింస్‌కు తీసుకువెళ్ళి చిత్తూరు నాగయ్య, బి.ఎన్ రెడ్డిలకు ఎదుట పాటకచ్చేరీ చేయించారు. తరువాత ఘంటశాల తన మకాంను పానగల్ పార్కు వాచ్‌మెన్‌కు నెలకు రూ.2/-లు ఇచ్చే ఒప్పందం చేసుకుని అక్కడకు మార్చారు. పగలంతా అవకాశాల కోసం వెతికి రాత్రికి పార్కులో నిద్రించేవారు. చివరికి సముద్రాల అప్పటి మద్రాసు రేడియో కేంద్రంలో లలిత గీతాల గాయకుడి అవకాశాన్ని ఇప్పించారు. పాటలు పాడుతూ సినీరంగంలో చిన్న చిన్న వేషాలు వేసేవారు. 1947లో లక్ష్మమ్మ చిత్రానికి సంగీత దర్శకునిగా మారారు. 100 సినిమాలకు పైగా సంగీత దర్శకత్వం వహించారు. కొన్ని చిత్రాలకు నిర్మాతగా కూడా వ్యవహించారు. 1969-72 మధ్యకాలంలో తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన గాయకునిగా కొనసాగారు. 1970లో ఆయనకు పద్మశ్రీ అవార్డు లభించింది. 1969 నుంచి తరచూ ఘంటశాల అనారోగ్యానికి గురయ్యేవారు. 1971లో ఐరోపా, అమెరికాలో ప్రదర్శనలు ఇస్తున్న సమయంలో ఘంటశాలకు గుండెనొప్పి వచ్చింది. హుటాహుటీన అక్కడి ఆసుపత్రికి తరలించారు. అప్పుడే ఆయనకు భగవద్గీత పాడాలనే కోరిక కలిగింది. భగవద్గీత పూర్తి చేసి సినిమా పాటలు పాడుకూడదని నిర్ణయించుకున్నారు. ఆ తరువాత 1972లో భక్త తుకారాం, జీవన తరంగాలు, దేవుడు చేసిన మనుషులు వంటి హిట్ చిత్రాలకు పాటలు పాడారు. ఘంటశాల గొంతు నుండి జాలువారిన భగవద్గీత శ్లోకాలు నేడు పార్థివ దేహాల వద్ద ఆలపించే పాటలుగా మారాయి. 1974 ఫిబ్రవరి 11న మరణించారు.

## టాలీవుడ్ సెలబ్రిటీల సమక్షంలో ఘనంగా "నువ్వే ఉండిపో ఇలా", "నువ్వేలే" సాంగ్స్ లాంఛ్.




అదోనై పిక్చర్స్ క్రియేషన్స్ సమర్పణలో ప్రముఖ కొరియగ్రాఫర్ సత్య మాస్టర్ దర్శకత్వంలో అంకిత జాదవ్, రోహిత్ భోగ హీరో హీరోయిన్స్ గా నటించిన"నువ్వే ఉండిపో ఇలా", "నువ్వేలే" పేరుతో రెండు సాంగ్స్ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ పాటలకు కెకె రెడ్డి ప్రొడ్యూసర్ గా వ్యవహరించారు. జయంత్ ఆర్యన్ సంగీతాన్ని సమకూర్చిన "నువ్వే ఉండిపో ఇలా", "నువ్వేలే" పాటలకు రాంబాబు గోసాల సాహిత్యాన్ని అందించారు. సింగర్స్ లిప్సిక, అదితి భావరాజు పాడారు.

ఈ కార్యక్రమంలో దర్శకులు సాయి రాజేశ్, శైలేష్ కొలను, కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్, ఆషురెడ్డి అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగాకొరియోగ్రాఫర్, డైరెక్టర్ సత్య మాస్టర్ మాట్లాడుతూ - నేను ఒక ఈవెంట్ కోసం యూఎస్ కు వెళ్లినప్పుడు ప్రొడ్యూసర్ కేకే రెడ్డి గారితో పరిచయం ఏర్పడింది. అప్పటికే ఈ సాంగ్స్ హిందీ వెర్షన్ రెడీగా ఉన్నాయి. తెలుగులో చేయాలనే ఆలోచనను వారు నాతో షేర్ చేసుకున్నారు. అలా "నువ్వే ఉండిపో ఇలా", "నువ్వేలే" సాంగ్స్ ను తెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం ప్రారంభించాం. అతి తక్కువ మంది క్రూతో రెండు సాంగ్స్ ను తక్కువ టైమ్ లో కంప్లీట్ చేశాం. అన్నీ మేమే అయ్యి ఈ పాటలను చిత్రీకరించాం. ప్రొడ్యూసర్ కేకే రెడ్డి గారు ఎంతో ప్యాషనేట్ గా ఈ పాటలను ప్రొడ్యూస్ చేశారు. జయంత్ మ్యూజిక్, లిప్సిక, అదితి పాడిన తీరు, రాంబాబు గారి సాహిత్యం అన్నీ మిమ్మల్ని ఆకట్టుకుంటాయి అన్నారు.
నిర్మాత కేకే రెడ్డి మాట్లాడుతూ - మా "నువ్వే ఉండిపో ఇలా", "నువ్వేలే" సాంగ్స్ లాంఛ్ కు వచ్చిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. మంచి లవ్ ఫీల్ తో ఈ పాటలను బ్యూటిఫుల్ గా పిక్చరైజ్ చేశారు మా డైరెక్టర్ సత్య గారు. ఆయన కొరియోగ్రఫీ కూడా ఈ పాటలకు హైలైట్ అవుతుంది. లిప్సిక, అదితి ఈ పాటలను పాడిన విధానం చూస్తే వారికి గానకోకిల అని పిలవాలని అనిపిస్తోంది. జయంత్ మంచి ట్యూన్ తో కంపోజ్ చేశారు. ఈ పాటలు మళ్లీ మళ్లీ వినేలా ఉంటాయి. మీ అందరి ఆదరణ మా సాంగ్స్ కు దక్కుతుందని ఆశిస్తున్నాం అన్నారు.
హీరోయిన్ అంకిత జాదవ్ మాట్లాడుతూ - నేను బాలీవుడ్ నుంచి వచ్చాను. అక్కడ మ్యూజిక్ ఆల్బమ్స్ చేస్తుంటాను. నేను చేసిన ఐదో మ్యూజిక్ ఆల్బమ్ ఇది. "నువ్వే ఉండిపో ఇలా", "నువ్వేలే" పాటలను న్యూయార్క్, షికాగోలో షూటింగ్ చేశాం. అక్కడ అనుకూల వాతావరణంలో సాంగ్స్ ను కష్టపడి చిత్రీకరించాం. సత్య మాస్టర్ డైరెక్షన్ లో ఈ సాంగ్స్ చేయడం సంతోషంగా ఉంది. మా పాటలను మీరంతా ఆదరిస్తారని కోరుకుంటున్నా అన్నారు.
మ్యూజిక్ డైరెక్టర్ జయంత్ ఆర్యన్ మాట్లాడుతూ - ఈ సాంగ్స్ ను మేము హిందీలో చేశాం. తెలుగులోకి తీసుకురావాలని అనుకున్నప్పుడు ఇక్కడ మ్యూజిక్ లవర్స్ ఎలా రిసీవ్ చేసుకుంటారో అని సందేహించాం. కానీ మా సాంగ్స్ లాంఛ్ కు ఇంతమంది పెద్దలు గెస్ట్ లుగా వచ్చాక చాలా నమ్మకం కలుగుతోంది. మా సాంగ్స్ ను తప్పకుండా తెలుగు ఆడియెన్స్ అంతా ఇష్టపడతారు అన్నారు.నటి అషురెడ్డి మాట్లాడుతూ - "నువ్వే ఉండిపో ఇలా", "నువ్వేలే" సాంగ్స్ చాలా బాగున్నాయి. సత్య మాస్టర్ బ్యూటిఫుల్ గా తెరకెక్కించారు. హీరోయిన్ అంకితకు ఈ సాంగ్స్ తర్వాత తెలుగులో మంచి అవకాశాలు రావాలని కోరుకుంటున్నా అన్నారు.డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ - సత్య మాస్టర్, ఆయన టీమ్ అంటే నాకు చాలా ఇష్టం. మాతో కూడా సత్య మాస్టర్ డ్యాన్సులు చేయించారు. "నువ్వే ఉండిపో ఇలా", "నువ్వేలే" సాంగ్స్ మంచి విజువల్స్ తో ఆకట్టుకుంటున్నాయి. చిన్న టీమ్ తీసుకుని ఈ పాటలను ఇంత బాగా తెరకెక్కించారు సత్య మాస్టర్. ఆయన కష్టం ఈ పాటలో తెలుస్తోంది. సత్య మాస్టర్ తో కలిసి పనిచేయాలని అనుకుంటున్నా. ఇండిపెండెంట్ మ్యూజిక్ ఇండస్ట్రీ మంచి పొజిషన్ లో ఉందిప్పుడు. మా చిన్నప్పుడు కూడా ప్రైవేట్ ఆల్బమ్స్ ఎంజాయ్ చేసేవాళ్లం. కథలో మాత్రమే ఫిట్ అయ్యే సాంగ్స్ మేము రూపొందిస్తాం. కానీ ఇండిపెండెంట్ ఆల్బమ్ లో ఆ పాట కోసం ఒక థీమ్ క్రియేట్ చేస్తారు. ఈ సాంగ్స్ ఈ టీమ్ అందరికీ మంచి పేరు తీసుకురావాలి అన్నారు
నటీనటులు - అంకిత జాదవ్, రోహిత్ భోగ

## కేంద్ర మంత్రి సీఆర్ పాటిలో సీఎం చంద్రబాబు భేటి
### వివిధ సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, ఆర్థిక సాయంపై విజ్ఞప్తి



న్యూఢిల్లీ ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్లోని వివిధ సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, ఆర్థిక సాయంపై విజ్ఞప్తి చేసారు. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్, తాగునీటి భద్రతకు ఇవి ఎంతో ముఖ్యమని వివరించారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై పెండింగ్లో ఉన్న అంశాలతో పాటు, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా సవివరంగా చర్చించారు.
ముఖ్యమంత్రి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి స్టాప్ వర్క్ ఆర్డర్ శాశ్వతంగా ఎత్తివేసేలా నిర్ణయం తీసుకోవాలి. ఈ ఆర్డర్ కారణంగా ప్రాజెక్టు అమలులో అవరోధాలు ఏర్పడుతున్నాయి. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు కారణంగా పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్మెంట్ చేయాలని కోరారు.
పోలవరం ప్రాజెక్టు ఫేజ్?ఎకి ఆర్థిక సహాయం అందించాలి... ఫేజ్?ఎలో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉంది. వీటికి అదనంగా సుమారు రూ.32,000 కోట్ల నిధులు అవసరం . గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో పోలవరం?నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు... తాగునీరు, సాగునీరు, పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టు. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసి, సాంకేతిక?ఆర్థిక సాయం ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు.
ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదాన్ని పరిష్కరించాలి. వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యుడీటీ) తుది నివేదిక గెజెట్లో ప్రచురించాలి. ట్రిబ్యునల్ నివేదికను వెంటనే గెజెట్లో ప్రచురించి, వంశధారపై నిర్మించ తలపెట్టిన నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలి. గోదావరి జలాల పంపకంపై ఏపీ-తెలంగాణ మధ్య వివాదం కొనసాగుతోంది. నదీ జలాల పంపకం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్ను తక్షణమే ఏర్పాటు చేయాలి. ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని అన్నారు.

## టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్ కు రూ 1 కోటి విరాళం



తిరుమల టీటీడీ ఎస్వీ ప్రాణాన ట్రస్ట్ కు రూ 1 కోటి విరాళం అందింది. హైదరాబాద్ కు చెందిన గుత్తా శ్రీ హర్షసాయిచౌదరి మంగళవారం నాడు క్యాంప్ కార్యాలయంలో ఛైర్మన్ బిఆర్ నాయుడుని కలిసి విరాళం అందజేసారు. ఛైర్మన్ దాత కుటుంబాన్ని అభినందించారు.

## అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

భద్రాద్రి కొత్తగూడెం అశ్వారావుపేట నూతన మున్సిపాలిటీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మొత్తం 22 వార్డులకు జరుగుతున్న ఎన్నికల్లో 35 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి రిటర్నింగ్ అధికారితో సహా ఐదుగురు సిబ్బందితో మొత్తం 175 మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. 35 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు ఎన్నికలను పర్యవేక్షించనున్నారు.ఆూఖ, అఎ, నలుగురు ఎస్సైలు, ఒక స్పెషల్ పార్టీ తో కలిపి మొత్తం 125 మంది పోలీసులు ఎన్నికల విధులు నిర్వహించనున్నారు.ఎన్నికల దృష్ట్యా మున్సిపాలిటీ మొత్తం పరిశీలించిన పోలీసులు 12 సెన్సిటివ్ కేంద్రాలను గుర్తించారు. 1,2,7,9,10, 11, 22 వార్డులకు చెందిన 12 పోలింగ్ కేంద్రాలలో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున పోలీసులు ఆయా పోలింగ్ కేంద్రాలకు అదనపు బలగాలను నియమించారు.రేపు ఉదయం 7 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకూ ఓటింగ్ జరగనుంది.ఈ 13వ తేదీ ఉదయం 8 గంటల నుండి వ్యవసాయ కళాశాలలో కౌంటింగ్ జరగనుంది.

## ఇల్లందు ప్రభుత్వ వైద్యశాలను సందర్శించిన జిల్లా జితేష్ వి.పాటిల్

ఇల్లందు తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్. హాస్పటల్లోని వసతులను, డాక్టర్ల పనితీరును పరిశీలించి రోగులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లందులోనీ తెలంగాణ వైద్య విధానం పరిస్థితిలో డాక్టర్ల పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. అందరు డాక్టర్లు ,ల్యాబ్ టెక్నీషియన్ ఫార్మసిస్టులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. మరింత పనితీరును మెరుగుపరచుకొని ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రభుత్వ అధికారులు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని తెలిపారు..

## ఒంగోలు చేరిన సిఐఎస్ఎఫ్ సైక్లోథాన్

ప్రకాశం తీర ప్రాంత రక్షణపై ప్రజల్లో అవగాన కల్పించే లక్ష్యంతో సీఐఎస్ఎఫ్ చేపట్టిన సైక్లోథాన్ ప్రకాశం జిల్లా ఒంగోలు చేరింది. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద సైక్లోథాన్ కు జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ స్వాగతం పలికారు. సైక్లోథాన్ లో పాల్గొన్న వారికి హారతులు ఇచ్చి జై భారత్ మాతా నినాదాలతో పోలీసు బ్యాండ్ తో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సైక్లోథాన్ కు కమాండెంట్ గా వ్యవహరిస్తున్న సంజీత్ మాట్లాడుతూ, తీర ప్రాంత ప్రజల్లో మత్తు పదార్థాలు, అక్రమ ఆయుధాల చొరబాటు వంటి వాటిపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ నెల 7వ తేదీన పశ్చిమ బెంగాల్ లో ఈ సైక్లోథాన్ ప్రారంభమైందన్నారు. మొత్తం 60 మంది సభ్యులు ఉన్న ఈ బృందంలో మహిళలు కూడా ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా మహిళా సాధికారతపై కూడా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ, సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ద్వారా తీర ప్రాంత ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఇది ఒక మంచి ప్రయత్నమన్నారు.

## మియాపూర్ నారాయణ స్కూల్ లో అగ్ని ప్రమాదం

హైదరాబాద్ మియాపూర్ లోని నారాయణ స్కూల్ లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా ఉదయం జనరేటర్ ఆన్ చేయడంతో మంటలు చేరేగాయి. స్కూల్ సిబ్బంది గమనించి పిల్లల్ని అందరిని ఒక్కసారిగా బయటికి పంపడంతో ప్రమాదం తప్పింది. సమచారం అందిన ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలను అదుపు చేశారు. మంటలకు గల కారణాలు ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉంది.

## షాద్ నగర్ లో 53,403 ఓటర్లు

షాద్ నగర్ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రేపు జరగనుండడం తో అన్ని ఏర్పాట్లు చేశారు అధికారులు. 53 వేల 403 మంది ఓటర్ లు తమ ఓటు హక్కు ని వినియోగించుకొనున్నారు, 28 వార్డులు ఉన్న ఈ మున్సిపాలిటీ కోసం 76 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేశారు, పోలింగ్ సిబ్బంది కి స్థానిక స్టేడియం లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ని ఏర్పాటు చేసారు, ఎలాంటి అవంచానియా ఘటనలు జరగకుండా షాద్ నగర్ డీసీపీ శిరీష ఆధ్వర్యంలో లో 200 మంది పోలీసులు పట్టణం తో పాటు పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించనున్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తలను కారు తో ఢీకొట్టిన ఎమ్మెల్యే రోహిత్

మెదక్ డబ్బులు పంచుతుండగా అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కారుతో ఢీకొట్టిన ఘటన ఇది. మెదక్ మున్సిపాలిటీలో 15,30 వార్డుల్లో మంగళవారం తెల్లవారుజామున డబ్బులు పంచేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, అతని అనుచరులు వచ్చారు. డబ్బులు పంచుతున్న మైనంపల్లి రోహిత్ ను బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. నిలదీసిన బీఆర్ఎస్ కార్యకర్తలను ఎమ్మెల్యే కారుతో ఢీకొట్టడంతో పలువురికి గాయాలు అయ్యాయి. గాయాలపాలైన బీఆర్ఎస్ కార్యకర్తలను ఆసుపత్రికి తరలించారు.

# కేసారం గ్రామ కార్యదర్శి అకారణ బదిలీ యత్నం సహించేది లేదు...

## బదిలీ జరిగితే కేసారం రణరంగమే కలెక్టర్ కార్యాలయ ముట్టడి తప్పదు

## గ్రామ ప్రజల తీవ్ర హెచ్చరిక




**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10(ప్రజాబలం)వికారాబాద్ జిల్లా:** మోమిన్ పేట/కేసారం గ్రామపంచాయతీ కార్యదర్శి రవి ని అకారణంగా బదిలీ చేయనున్నారన్న ఊహాగానాలు గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీస్తున్నాయి. ఎటువంటి పరిపాలనా లోపాలు లేకుండా, నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న కార్యదర్శిని బదిలీ చేయాలన్న ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కేసారం గ్రామ ప్రజలు మండిపడుతున్నారు,ఈ విషయమై గ్రామపంచాయతీ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య తీవ్ర స్థాయిలో స్పందిస్తూ, "కేసారం గ్రామ కార్యదర్శి రవి ని అకారణంగా బదిలీ చేస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. అవసరమైతే కేసారం గ్రామం రణరంగంగా మారుతుంది. వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించడానికైనా వెనుకాడం" అంటూ ఘాటైన హెచ్చరికలు జారీ చేశారు,రవి గ్రామానికి కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి చేర్చడంలో కీలక పాత్ర పోషించారని సర్పంచ్ పేర్కొన్నారు. పారదర్శక పాలన, వేగవంతమైన సేవలు, అవినీతికి తావులేని పరిపాలనతో గ్రామ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న అధికారిని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ బదిలీ యత్నం వెనుక కుట్ర ఉందని ఆరోపించారు,ఇలాంటి నిజాయితీగల అధికారిని తొలగిస్తే గ్రామాభివృద్ధి నిలిచిపోతుందని, పథకాల అమలుకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఏకగ్రీవంగా రవి బదిలీకి వ్యతిరేకంగా నిలిచారని తెలిపారు,ఈ బదిలీపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కేసారం గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రజాస్వామ్యబద్ధంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు, నిరసనలు, కలెక్టర్ కార్యాలయ ముట్టడి వంటి కార్యక్రమాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. అధికారుల నిర్లక్ష్యం కొనసాగితే దానికి పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# దార్లపల్లి పరిసరాలు పరిశుభ్రం చేఈ స్తున్న గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాలరాజ్




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 10 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం దార్లపల్లి గ్రామంలో పరిసరాలు పరిశుభ్రం చేయిస్తున్న గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్రాజ్ గ్రామంలో మురికి కాలువలు డ్రైనేజీలు వీధి వీధిన పరిసరాలు పరిశుభ్రత కార్యక్రమంలో గ్రామాన్ని పరిశుభ్రంగా చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ తెలిపారు గ్రామ ప్రజలతో గ్రామ పెద్దలతో ఎప్పటికప్పుడు గ్రామం గురించి చర్చించి గ్రామ అభివృద్ధి కోసం గ్రామ పరిసరాల పరిశుభ్రత కోసం నా వంతుఎల్లవేళలా కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్రాజ్ తెలిపారు

# కాంగ్రెస్ పార్టీకి మీరు ఓటు వేయండి పదిమందితో వేయించండి. తూడి శారద రెడ్డి.



వనపర్తి. ప్రస్తుతం జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రతి ఒక్కరు ఓటు వేసి, మరో 10 మందితో ఓటు వేయించాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి సతీమణి శారద రెడ్డి పిలుపునిచ్చారు.ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వనపర్తి పట్టణంలోని 31వ వార్డులో ఆమె కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ స్థానిక కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి విజయలక్ష్మి రాధాకృష్ణ ని అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు.ఇంటింటి ప్రచారానికి వెళ్లిన శారద రెడ్డికి స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు.నుదటన తిలకం దిద్ది శాలువాలతో సత్కరించి తప్పకుండా హస్తం గుర్తుకే తమ ఓటు వేస్తామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలల ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి మహిళలకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు.మహిళల పేరు మీద ఇందిరమ్మ ఇల్లు.మహిళా పేరున్నే రేషన్ కార్డులుమహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం.మహిళలకు వడ్డీ లేని రుణాలు.గ్రామాలలో, మండలలలోజిల్లా కేంద్రంలోనూ మహిళా సమైక్యలకు నూతన భవనాల నిర్మాణాలు.క్యాంటీన్ లో ఏర్పాటు.డీజిల్ బంకులు ఏర్పాటు.పాతశాల విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు తయారీని మహిళలకు ఇవ్వడం జరిగిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల లోనే వనపర్తి పట్టణం సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తుందని ఆమె చెప్పారు.రానున్న కాలంలోనూ వనపర్తి అన్ని రంగాలలో ముందు ఉండాలంటే మనం కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను తప్పకుండా గెలిపించాలని ఆమె సూచించారు.31 వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అయిన విజయలక్ష్మి ని కౌన్సిలర్ గా గెలిపిస్తే వార్డులోని అన్ని సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని శారదా రెడ్డి పేర్కొన్నారు.కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్రీశైలం పాదయాత్రికులకు మాంద్ర.శివానందరెడ్డి సేవాదళ్ భావన రాము టీమ్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం

:- పాములపాడు మండలంలోని, ఎర్రగూడూరు నేషనల్ హైవే రహదారి పక్కన జంబుల్లమ్మ దేవాలయం దగ్గర శ్రీశైలం వెళ్లే పాదయాత్రికులు, భక్తులకు మాంద్ర.శివానందరెడ్డి సేవాదళ్ భావన రాము టీమ్ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా ఐదు రోజులుగా అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఇది రెండో సంవత్సరం కూడా శివ స్వాముల కొరకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం మండల సాంస్కృతిక విభాగం అధ్యక్షులు భావన వినోద్ కుమార్, మిట్టకందాల సీనియర్ నాయకులు సంజన్న, నియాజ్, రామకృష్ణ, బూత్ 206 ఇంచార్జి నాగ శ్రీనివాసులు, తదితరులు పాల్గొని అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరిగింది.

# సమన్వయంతో భక్తులకు సాఫీగా దర్శనం చేయించాలి.

## వేములవాడ ఏఎస్పి రిత్విక్ సాయి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్.

## మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై ఉన్నతాధికారుల పరిశీలన.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** అధికారులు సమన్వయంతో భక్తులకు సాఫీగా దర్శనం చేయించాలని వేములవాడ ఏ ఎస్ పి రిత్విక్ సాయి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆలయ అధికారులను ఆదేశించారు.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను వేములవాడ ఏఎస్పి రిత్విక్ సాయి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం రోజున పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేస్తున్న క్యూలైన్లు, భక్తుల ఎంట్రీబిఎగ్జిట్ మార్గాలు, పార్కింగ్ సదుపాయాలు తదితర అంశాలను వారు పరిశీలించారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులకు సూచించారు.

ప్రధానంగా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పరిశీలనలో ఆలయ ఈవో రమాదేవి, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, ఈ ఈ రాజేష్, ఆర్ అండ్ బి డి ఈ శాంతయ్య, డి ఈ మైపాల్ రెడ్డి, ఆలయ ఇంచార్జ్ స్థానాచార్యులు నమిలిగొండ ఉమేష్ శర్మ, పోలీస్ అధికారులు, ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

# మంథనిలో మున్సి" పోల్" కు సర్వం సిద్ధం

## -పోలింగ్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపిణీ

## -పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది

## -గుర్తింపు పొందిన 14 రకాల ఐడెంటిటీ కార్డులలో ఏదో ఒకటి తీసుకువెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు

## -100 శాతం ఓటింగ్ అయ్యేందుకు ఓటర్లు కృషి చేయాలని పిలుపునిచ్చిన మంథని సహాయ ఎన్నికల అధికారి ఎన్ మనోహర్

మంథని రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం జరగనున్న మున్సిపల్ / కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా మంథని పట్టణంలో జరగనున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.మంథని మున్సిపాలిటి కి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మంథని సహాయ ఎన్నికల అధికారి, మంథని మున్సిపల్ కమిషనర్ ఎన్ మనోహర్ స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ వద్ద మంగళవారం పోలింగ్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంథని సహాయ ఎన్నికల అధికారి, మంథని మున్సిపల్ కమిషనర్ ఎం మనోహర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో మొత్తం 13 వార్డులలో 14,402 వేల మంది ఓటర్లు ఉన్న నేపథ్యంలో 26 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సుమారు 130మంది సిబ్బందితో ఎన్నికల నిర్వహణ చేపడుతున్నామని, సాయంత్రం లోపు పీఓ, ఏపీవో, ఓపీఓలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, ఓటరు స్లిప్పుతో పాటు గుర్తింపు పొందిన 14 రకాల ఐడెంటిటీ కార్డులలో ఏదో ఒకటి తీసుకువెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని సూచించారు. మున్సిపల్ పరిధిలో 100 శాతం ఓటింగ్ అయ్యేందుకు ఓటర్లు కృషి చేయాలని మంథని సహాయ ఎన్నికల అధికారి, మంథని మున్సిపల్ కమిషనర్ ఎం మనోహర్ పిలుపునిచ్చారు.గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీల ప్రయత్నంతెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి పోలింగ్‌పై పడింది. మంథని మున్సిపాలిటీలో బుధవారం ఓటింగ్ జరగనుంది. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్,బీజేపీ అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా వార్డులను చుట్టేసి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు సైతం రంగంలోకి దిగి ప్రచారాన్ని హోరెత్తించడంతో గల్లీ రాజకీయం కాస్తా రాష్ట్ర స్థాయి చర్చకు దారితీసింది.

ప్రజాస్వామ్య వేడుకకు సర్వం సిద్ధం

పోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు ఇప్పుడు తెరవెనుక వ్యూహాలకు పదును పెడుతున్నారు. వార్డుల్లోని స్థానిక సమస్యల కంటే పార్టీల బలాబలాలు, వ్యక్తిగత పరపతి ఈ ఎన్నికల్లో కీలకం కానున్నాయి. ఒకవైపు రాజకీయ వేడి, మరోవైపు అధికారుల చైతన్య కార్యక్రమాల మధ్య ఓటర్లు ఎవరికి పట్టం కడతారనేది ఆసక్తికరంగా మారింది. ప్రచారం ముగియడంతో పోలీసులు నిఘా పెంచారు, సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం జరిగే పోలింగ్ కోసం ఎన్నికల సిబ్బంది సామాగ్రితో ఇప్పటికే ఆయా కేంద్రాలకు చేరుకున్నారు.

# 19 నెలల బాలికపై కుక్కలు దాడి

## బాలికకు తీవ్ర గాయాలు

## కుక్కల బారి నుండి కాపాడాలి అంటూ స్థానికుల డిమాండ్

మేడ్చల్ మల్కాజిగిరి 19 నెలల బాలికపై కుక్కలు దాడి చేసి గాయపరచిన ఘటన కండ్లకోయ లో చోటు చేసుకుంది. కుక్కల దాడిలో బాలిక తీవ్రంగా గాయపడి ఆస్పత్రిపాలైంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కండ్లకోయ గ్రామంలోని వేణు సుప్రజ కూతురు దాక్షిని అనే 19 నెలల బాలిక ఆదివారం రాత్రి ఆరు బయట ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. చుట్టుపక్కల వాళ్ళు చూసి కుక్కను తరిమి వేసి బాలికను కాపాడారు. ఈ ఘటనలో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. పాపను వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

వరుస సంఘటనలు జరిగిన పట్టించుకోరా

గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో కుక్కల దాడుల సంఘటనలు వరుసగా జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సైతం ఇంటిముందు ఆడుకుంటున్న బాబు పై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. సైకిల్ పై వెళుతున్న ఓ వృద్ధుడిపై కుక్కలు వెంటాడి మరి వృద్ధుడిని గాయపరిచాయి. ఇలాంటి ఘటనలో వెలుగులోకి రానివి ఎన్నో ఉన్నాయి. ఇప్పుడు తాజాగా కండ్లకోయాలో 19 నెలల బాలిక ఆడుకుంటుండగా కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది.

కుక్కలు బాబోయ్ కుక్కలు

మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలో వీధికి పది కుక్కలు ఉన్నాయి. రోడ్డుపై బైఠాయించి వచ్చిపోయే ప్రయాణికులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రజలు రోడ్డు పైకి రావాలంటే జంకుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలను బయటకు పంపాలంటే స్థానికులు భయపడుతున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఉదయం వేళలో వాకింగ్ చేసే వారి విషయంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వాకింగ్ చేయాలంటే ప్రజలు భయపడుతున్నారు. రోడ్డుపై బైఠాయించి వాకింగ్ వచ్చే వారిపైకి వెలుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి కుక్కల నుండి కాపాడాలి అంటూ స్థానికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# బీచ్ ఫెస్టివల్ ను విజయవంతం చేయాలి

ఒంగోలు పాకాల బీచ్ లో జరిగే బీచ్ ఫెస్టివల్ కు ప్రజలందరూహాజరై విజయవంతంచేయా లని చేయాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు పిలుపునిచ్చారు.కనిగిరి నియోజకవర్గ కేంద్రంలో సింగరాయ కొండ పాకల బీచ్ లో నిర్వహించే బీచ్ ఫెస్టివల్ ను ప్రమోట్ చేయడానికి స్థానిక విద్యుత్ శాఖకార్యాల యంనుండి పామూ రు రోడ్డు సెంటర్ వరకు 2కె వాక్ ను జిల్లా కలెక్టర్ రాజా బాబు, రాష్ట్ర టూరి జం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, కనిగిరి శాసన సభ్యులు ముక్కుఉగ్ర నర సింహారెడ్డి నిర్వ హించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాకల బీచ్ రాబోయే రోజుల్లోజిల్లాకు తల మానికంగా ఉంటుంద ని ఆయన అన్నారు. కోస్తా జిల్లాలలో పాకల బీచ్ ను బెస్ట్ బీచ్ గా తయారు చేస్తామని ఆయన చెప్పారు. పాకల సింగరాయ కొండకు జాతీయ రహదారికి 10 కిలోమీ టర్ల దూరం మాత్రమే ఉంటుందని జిల్లా ప్రజ లకు రాకపోక లకు చాలాఅనువుగా ఉంటుందని ఆయన చెప్పారు. పాకల బీచ్ లో ఈనెల 14,15 రెండు రోజులపాటు బీచ్ ఫెస్టివల్ నిర్వ హించడానికి అన్ని రకాల ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. కనిగిరి చుట్టుపక్కల ప్రాంతా ల ప్రజలు బీచ్ ఫెస్టివ ల్ కు కుటుంబ సమే తంగాహాజరై ఆనందా న్ని పొందాలని ఆయ న చెప్పారు. ఈ బీచ్ ఫెస్టివల్ లో హెలి కాప్టర్ రైడింగ్, వాటర్ స్పోర్ట్స్, వాలీబాల్ గేమ్స్ , మ్యూజిక్ నైట్ అన్ని రకాల ఫుడ్స్ స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడు తూ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ను అంతర్జాతీయ స్థాయిలోటూరిజనీను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకున్నా రని ఆయన చెప్పారు.

## ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి


### జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** మంగళవారం 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రేపు బుధవారం (11వ తేదీ) జరగనున్న పోలింగ్ రోజున అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.

ఎన్నికల కోసం నోటిఫై చేయబడిన ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, దుకాణాలు, కర్మాగారాలలో పనిచేసే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు , స్థానిక సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వాములుగా ప్రతి ఓటరు బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



**కామారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** లెండి అంతర్రాష్ట్ర ప్రాజెక్టుకు సంబంధించి 12వ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంను ఇంజనీర్-ఇన్-చీఫ్ (జనరల్) చాంబర్, జలసౌధ భవనం, ఎర్రమంజిల్, హైదరాబాద్లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం వర్చువల్ విధానంలో పాల్గొని, ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై చర్చల్లో పాల్గొన్నారు.

## కౌంటింగ్ సిబ్బంది యొక్క రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ సమక్షంలో పూర్తి



**కామారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కౌంటింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, సాధారణ పరిశీలకులు ప్రశాంత్ కుమార్ సమక్షంలో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ సమావేశ మందిరంలో ఎన్నికల సంఘం నిబంధనలననుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు.

ఎన్నికలు నిర్వహించవలసి ఉన్న నాలుగు మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల కౌంటింగ్ విధులు నిర్వర్తించే కౌంటింగ్ సూపర్వైజర్లు, అసిస్టెంట్లను రెండవ ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు.

కౌంటింగ్ సిబ్బంది మొత్తం సూపర్వైజర్లు 89

అసిస్టెంట్లు 178 మంది సిబ్బందిని కేటాయించడం జరిగిందని ఆయా మున్సిపాలిటీల్లో కేటాయించిన వారికి వారి వారి మున్సిపాలిటీల్లో 12వ తేదీన మధ్యాహ్నం 2.00 గంటలకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు

ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్లు విక్టర్ , మదిమోహన్, CPO రఘునందన్ ూూ శివకుమార్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు ఉన్నారు.

## ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** బంజారాల ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో జయంతి ఏర్పాట్లపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సేవాలాల్ మహారాజ్ బంజారా సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచారని, ఆయన జయంతి వేడుకలను గౌరవప్రదంగా నిర్వహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ నెల 18 న జిల్లాకేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

గిరిజన తండాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వేడుకల ప్రాంగణాల్లో తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, నిరంతర విద్యుత్ సరఫరా వంటి ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ రద్దీ నివారణకు అవసరమైన మళ్లింపులు చేపట్టాలని సూచించారు. పార్కింగ్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్యశాఖ ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సేవాలాల్ మహారాజ్ బోధనలు, ఆయన సమాజ సేవలను యువతకు తెలియజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

అనంతరం సేవాలాల్ జయంతి వేడుకలకు సంబంధించిన పోస్టర్ ను అధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మట్, గిరిజన సంక్షేమ శాఖ, పోలీస్ శాఖల అధికారులు, బంజారా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి:

### జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా స్థానిక టీటీడీసి (ఋణజ) కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరైన ప్రిసైడింగ్ అధికారులు (ౡూలు), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఋూలు)కు పలు సూచనలు చేస్తూ, సామగ్రి పంపిణీ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులు, పేపర్ సీల్స్, స్టేషనరీ కిట్లను స్వీకరించే సమయంలోనే సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, లోపాలు గమనించినట్లయితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది కేటాయించిన వాహనాల్లో సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు.



పోలింగ్ అనంతరం డైరీలు, రిజిస్టర్లు, సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం స్వీకరించేందుకు రిసెప్షన్ కౌంటర్లను పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల అమలులో ఎలాంటి అజాగ్రత్త వహించినా లేదా విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మున్సిపల్ ఎన్నికల ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలింగ్ సిబ్బంది తమ బాధ్యతలను నిష్పక్షపాతంగా, నిబంధనలకు లోబడి నిర్వర్తించాలని సూచించారు. ప్రతి దశలో చెక్లిస్టులను అనుసరిస్తూ సామగ్రి స్వీకరణ, పోలింగ్ నిర్వహణ, రిసెప్షన్ ప్రక్రియలను క్రమబద్ధంగా పూర్తి చేయాలని ఆదేశించారు. శాంతియుత, స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు హనుమంతు నాయక్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాజేశ్వర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, మున్సిపల్ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



## నిర్లక్ష్యంపై కఠిన చర్యలు: ,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ,బైంసాలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాల తనిఖీ

**ఫిబ్రవరి 10, 2026-నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. మంగళవారం బైంసాలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ (డిస్ట్రిబ్యూషన్) రిసెప్షన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఏర్పాట్లను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి అధికారి తన బాధ్యతను కచ్చితంగా నిర్వర్తించాలని అన్నారు. పోలింగ్ సామగ్రి స్వీకరణ సమయంలో బ్యాలెట్ బాక్సులు, పేపర్ సీల్స్, స్టేషనరీ కిట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఏవైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన వాహనాల్లోనే నిర్ణీత సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి దశలో చెక్లిస్టులను అనుసరిస్తూ క్రమబద్ధంగా ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

జనరల్ అబ్జర్వర్ వీరా రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఓటర్లు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా సిబ్బంది సహకరించాలని కోరారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ మాట్లాడుతూ, పోలింగ్ ముగిసిన తర్వాత డైరీలు, రిజిస్టర్లు, సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం రిసెప్షన్ కౌంటర్లలో అప్పగించాలని తెలిపారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉన్నాయని చెప్పారు. సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు.

అనంతరం రూట్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు వాహనాలలో వెళ్తున్న అధికారులకు, సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేసారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ ని కలసిన వెంకటేశ్వర కాలనీ స్థానికులు



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 10 ఫిబ్రవరి 2026**ప్రజల బాగు కోరి వదిలిన పార్కు తదితర ప్రముఖ స్థలాలను ఆక్రమణలకు గురి కాకుండా ఉండడానికి గాను ఎదురొడ్డి పోరాటం చేస్తున్న స్థానిక ప్రజలకు మద్దతుగా ఉండి 30 కోట్ల విలువగల 1250 గజాల పార్కు స్థలం, 800 గజాల కమిటీ హాల్ స్థలం, 600 గజాల సెప్టిక్ ట్యాంకు స్థలంలను ఆక్రమణలకు గురి కాకుండా చేయడంలో పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ని మర్యాద పూర్వకంగా కలసి వారికి ధన్యవాదాలతో కూడిక కృతజ్ఞతా అభినందనలు తెలిపిన నెక్నంపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటేశ్వర రెసిడెన్షియల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పద్మ, శ్రీనివాసన్, శేషేంద్ర, శివ, హైదర్ అలీ, నరసింహారెడ్డి, నితీష్, ఘౌస్, వసంత్, గోపాల్, ఆరిఫ్, సుజాత, సీత, లావణ్య, ఉష, విజయలక్ష్మి, సుప్రియా, పారిజాత, జ్ఞానేశ్వరి తది తరులు.

# మేడ్చల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన: కలెక్టర్ మను చౌదరి




**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఫిబ్రవరి 10:**మున్సిపాలిటిలు, మున్సిపల్ కార్పొరేషన్ ల సాధారణ ఎన్నికల 2026లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఎన్నికలకు ఉపయోగించే సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ను సాధారణ ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లే తో కలిసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు.

మంగళవారం మూడుచింతలపల్లి, ఆలియాబాదు, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లతో పాటు స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రి, సిబ్బందిని పోలింగ్ బూతులకు నిర్ణీత సమయంలో చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలని ఎన్నికల సిబ్బందిని కోరారు . స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్లకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రతి కౌంటింగ్ టెబుల్స్ దగ్గర సిసి కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.



# కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకుడు కె.గంగాధర్,జిల్లా విద్యాధికారి యాదయ్య లతో కలిసి కౌంటింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ కొరకు అదనపు సిబ్బందితో కలిపి 66 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 132 మంది కౌంటింగ్ సహాయకులు,బెల్లంపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 19 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు,37 మంది కౌంటింగ్ సహాయకులు,చెన్నూరు మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 10 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు,20 మంది కౌంటింగ్ సహాయకులు,, క్యాతనపల్లి మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి 24 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు,48 మంది కౌంటింగ్ సహాయకులు,లక్షెట్టిపేట మున్సిపాలిటీకి అదనపు సిబ్బందితో కలిపి9 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు,18 మంది కౌంటింగ్ సహాయకులను రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా కేటాయించడం జరిగిందని తెలిపారు.ఈ నెల 12వ తేదీన మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కు కేటాయించిన కౌంటింగ్ సిబ్బంది సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో, బెల్లంపల్లి,క్యాతనపల్లి, చెన్నూర్, లక్షెట్టిపేట మున్సిపాలిటీలకు కేటాయించిన కౌంటింగ్ సిబ్బంది ఆయా మున్సిపల్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని,ఈ నెల 13వ తేదీన మున్సిపల్ కార్పొరేషన్, ఆయా మున్సిపాలిటీలకు సంబంధించి ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలకు సకాలంలో హాజరై విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నుంచి మాజీ కౌన్సిలర్ దుర్గేష్ సస్పెన్షన్

## పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు చర్యలు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 10 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** జోగిపేట మున్సిపాలిటీ, 14వ వార్డు మాజీ కౌన్సిలర్ దుర్గేష్,ను కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెన్షన్ చేస్తు, డిసిసి మున్సిపల్ ఎన్నికల పరిశీలకులు, నిర్ణయం తీసుకున్నారు, కుల సమీకరణలో, కౌన్సిలర్గా టికెట్ కోల్పోయిన దుర్గేష్, కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గం, మంత్రి దామోదర్ రాజనర్సింహ, నిర్ణయించిన అభ్యర్థి, జోగిళ్ల చంద్రకళకు వ్యతిరేకంగా, రెబల్గా పోటీలో ఉన్నందుకు గాను, ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు, నాయకులు తెలిపారు, మున్సిపల్ పరిధిలోని, 3, కౌన్సిలర్ స్థానాలను, మాల కమ్యూనిటీకి కేటాయించడంతో,14 వ వార్డు మాదిగ కమ్యూనిటీకి కేటాయించినట్లు, వారు తెలిపారు, భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పిస్తామని, మంత్రి ద్వారా నాయకులు సూచించిన, విత్ డ్రా కాక, కాకపోవడంతో, మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు, దుర్గేష్ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే, కాంగ్రెస్ పార్టీలోకి వచ్చాడని, అంతకుముందు బీఆర్ఎస్ లో ఉన్నాడని, ఇప్పుడు కూడా బిఆర్ఎస్ పార్టీకి, ప్రయోజనం చేకూర్చేందుకే, బరిలో ఉన్నట్లు, పట్టణ ఎస్సీ సెల్ నాయకులు, ఆరోపించారు.....

# అభిమానం అంటే ఇది



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవర10 (ప్రజాబలం ) సంగారెడ్డి జిల్లా :** ఆందోల్ –జోగిపేట, మున్సిపల్ ఎన్నికల సందర్భంగా, మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా, ఆందోల్, జోగిపేట, మున్సిపల్ పరిధిలోని 15వ, వార్డులో, కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న

( చిట్టిబాబు ) ఓ యువకుడు చేస్తున్న, విచిత్ర ప్రచారానికి, అందరూ అభిమానం అంటే ఇదేరా అని అనుకుంటున్నారు, ఇంతకీ ఆ యువకుడు చేస్తున్న ప్రచారం ఏమిటంటే, తన సైకిల్ కు కాంగ్రెస్ పార్టీ జెండాలతో పాటు, కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న చిట్టిబాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఫోటోలు తో కూడిన కటౌట్లతో, ప్రచార రాదంగ తయార చేసుకున్నాడు, రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు, 15వ వార్డు, పరిధిలోని వీధి వీధి తిరుగుతూ, హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలంటూ, ప్రచారం చేస్తున్నాడు, అతడు ప్రత్యేకంగా ఫోన్లో, ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాల తో పాటు , అభివృద్ధికి సంబంధించిన పాటలను, డౌన్లోడ్ చేసుకొని, తన సైకిల్ ప్రచారం ద్వారా అందరికీ వినిపిస్తూ, కౌన్సిలర్ అభ్యర్థి చిట్టిబాబు, అలాగే పార్టీపై తన అభిమానాన్ని చాటుకుంటున్నాడు,

# వేములవాడ మున్సిపల్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం)** బుధవారం రోజున వేములవాడ మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల ఏర్పాటు పూర్తి చేసినట్లు వేములవాడ ఆర్డీవో రాధాబాయి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్/రిసెప్షన్ సెంటర్ వద్ద మంగళవారం రోజున పోలింగ్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేములవాడ ఆర్డిఓ రాదాబాయి మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో మొత్తం 28 వార్డులలో 40,000 పై చిలుకు మంది ఓటర్లు ఉన్న నేపథ్యంలో 30 పోలింగ్ స్టేషన్ల,58 పోలింగ్ బూతులను ఏర్పాటు చేసినట్లు ఆర్డీవో తెలిపారు. సుమారు 500 మంది సిబ్బందితో ఎన్నికల నిర్వహణ చేపడుతున్నామని, మంగళవారం సాయంత్రం లోపు పిఓ, ఏ పీ ఓ, ఓ పి ఓ లు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుంటారని అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, ఓటర్ స్లిప్పు తో పాటు భారత ప్రభుత్వం గుర్తింపు పొందిన 14 రకాల ఐడెంటి కార్డులలో ఏదో ఒకటి తీసుకువెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని సూచించారు. మున్సిపల్ పరిధిలో 100% ఓటింగ్ జరిగేందుకు ఓటర్లు కృషి చేయాలని ఆర్డీవో రాధాబాయి పిలుపునిచ్చారు.

# భార్యల గెలుపు కోసం భర్తల ఆరాటం

## తల్లి గెలుపు కోసం కొడుకు పోరాటం



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఫిబ్రవరి 10, (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** ఆందోల్,-జోగిపేట, మున్సిపాలిటీ పరిధిలో, 20, వార్డులకు సంబంధించిన, కొన్ని వార్డుల కౌన్సిలర్లకు, మహిళలకు రిజర్వేషన్ రావడంతో, మహిళా అధ్యక్షులు రంగంలో ఉన్నారు, పోటీ చేయాలనుకున్న అభ్యర్థులకు, అనుకూలించకపోవడంతో, తమ భార్యలను రంగంలోకి దించి, పోటీలో నిలబెట్టారు, భార్య గెలుపు కోసంభర్త,అంతేకాకుండా తల్లి గెలుపుకోసం,కొడుకునిత్యం ఉదయం నుండి రాత్రి వరకు, ఆరాటానికి అంతులేకుండా, పోయింది, మహిళలు కౌన్సిలర్ గా గెలిచినప్పటికీ, పెద్దతనం అంతా భర్తలదే ఉంటుంది, కాబట్టి గెలిపించుకోవాలనే ఆరాటం ఓటర్లను ఓటు హక్కు అడగడంలో కనిపిస్తుంది.....

# బడ్జెట్ సమావేశాలను ప్రారంభించిన మేయర్ డాక్టర్ శిరీష.

తిరుపతి నగరపాలక సంస్థ చివరి ఐదవ బడ్జెట్ సమావేశాలను నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ఎస్వీయూ సెనేట్ హాల్ లో ప్రారంభమయ్యాయి.. బడ్జట్ సమావేశాన్ని మేయర్ డాక్టర్ శిరీష లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ....వరుసగా ఐదవ బడ్జెట్ ప్రవేశ పెట్టే కౌన్సిల్ కి మేయర్ గా ఉండే అవకాశం నాకు లభించినందుకు చాలా సంతోషంగా ఉంది.మీ అందరి సహకారంతోనే నాకు ఈ గౌరవం లభించింది. అందుకు వ్యక్తిగతంగా ప్రత్యేక అభినందనలు. చిన్న ఆశ అయితే ఉన్నింది.. అదే చివరి బడ్జెట్ గ్రేటర్ తిరుపతి నగర బడ్జెట్ గా పెట్టే అవకాశం వస్తుందని. గ్రేటర్ ఆలస్యం అవుతున్నందుకు కొంత అసంతృప్తి ఉన్నా నాకు నమ్మకం ఉన్నది.. తదుపరి ఎన్నికలు మాత్రం గ్రేటర్ తిరుపతి నగర పాలక సంస్థకే జరుగుతుందని. మరో మారు రాష్ట ప్రభుత్వానికి మన కౌన్సిల్ తరపున, తిరుపతి నగర ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్నాను గతంలో కౌన్సిల్ ఆమోదించిన గ్రేటర్ తిరుపతికి ఆమోదం తెలపాలని.బడ్జెట్ అనేది ఒక నిర్ణీత కాలానికి (సాధారణంగా ఒక సంవత్సరం) రాబోయే ఆదాయ, వ్యయాల యొక్క అంచనా ఆర్థిక ప్రణాళిక. ఇది కుటుంబం, వ్యాపారం లేదా దేశం మరియు మన లాంటి నగరం యొక్క ఆర్థిక వనరులను సమర్థవంతంగా ఉపయోగించడానికి, అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవడానికి మరియు పొదుపును పెంచుకోవడానికి సహాయపడే ఒక నివేదిక.

# మున్సిపల్ ఎన్నికలకు 800 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాట్లు.

## పోలింగ్ పూర్తి అయ్యేవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి.

## స్వేచ్ఛాయుత వాతావరణం లో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి.

## ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలలో 163 బి ఎన్ ఎస్ ఎస్ (144 సెక్షన్ అమలు).



**వేములవాడ టౌన్,(ప్రజాబలం),** వేములవాడ, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో జరుగు ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా, ఎలాంటి అవాచనియ ఘటనలు చోటు చేసుకోకుండా 800 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే తెలిపారు.

మంగళవారం రోజున వేములవాడ, సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల విధులపై జిల్లా ఎస్పీ దిశ నిర్దేశం చేశారు.

ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు వేములవాడ, సిరిసిల్ల మున్సిపాలిటీల పరిధిలో రూట్ మొబైల్స్:17 జోనల్ టీమ్స్: 06(ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో), రిజర్వ్ టీమ్స్: 04 స్ట్రైకింగ్ ఫోర్స్, 02 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 02 ఏర్పాటు చేసి మొత్తం ఎనిమిది వందల మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎట్టి పరిస్థితులలోనూ పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్ళరాదని, రూటు మొబైల్ అధికారులు తమకు కేటాయించిన రూట్లలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాల వద్ద,



రూట్లలో ఎన్నికల ప్రశాంత వాతావరణము కలిగించే చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు.

పోలింగ్ కేంద్రాలలోకి సెల్ ఫోన్లు, మందు గుండు సామాగ్రి, ఇంకు బాటిల్లు, వాటర్ బాటిల్ తీసుకువెళ్లడం నిషేధమని, పోలింగ్ బూత్ లో సెల్ఫీలు దిగడం పై పూర్తిగా నిషేధం ఉంటుందని తెలిపారు. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీలలో 163 బి ఎం ఎస్ ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని, ఎన్నికల నియామవళి అమల్లో ఉన్నందున ఆంక్షలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చట్టపర పైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పి రిత్విక్ సాయి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఆర్ ఐ లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలింగ్ నిర్వహణ కొరకు పూర్తి స్థాయి ఏర్పాట్లు

## జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 :** 2వ మున్సిపల్ సాధారణ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన జరగనున్న పోలింగ్ నిర్వహణ కొరకు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో కమిషనర్ అన్వేష్ తో కలిసి ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించి సామాగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో ఈ నెల 11వ తేదీన ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, 13వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్ లో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టి, సామాగ్రిని, సిబ్బందిని సురక్షితంగా కేటాయించిన ప్రకారం పోలింగ్ కేంద్రాలకు తరలించాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగే విధంగా సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్లకు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడం జరిగిందని, ఈసారి ఎన్నికల నిర్వహణలో పోలీసు శాఖతో పాటు అటవీ, ఆబ్కారీ శాఖ సిబ్బంది సమన్వయం చేసుకొని ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి

## జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11వ తేదీన జరగనున్న పోలింగ్ రోజున అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్నికల కోసం నోటిఫై చేయబడిన ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, దుకాణాలు, కర్మాగారాలకు పోలింగ్ రోజున ఆయా సంస్థలలో పని చేసే ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి వీలుగా వేతనంతో కూడిన సెలవు,అన్ని ప్రభుత్వ కార్యాలయాలు,స్థానిక సంస్థలకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు,కౌంటింగ్ రోజున వినియోగించే ప్రభుత్వ భవనాల విద్యా సంస్థలకు పోలింగ్ నిర్వహణ కోసం స్థానిక సెలవులు ఉపయోగించబడతాయని తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

## జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10 :** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఈ నెల 11వ తేదీన పోలింగ్ నిర్వహణకు జిల్లాలోని 1 మున్సిపల్ కార్పొరేషన్, 4 మున్సిపాలిటీలలో అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో 60 డివిజన్లకు గాను 265 పోలింగ్ కేంద్రాలు, బెల్లంపల్లి మున్సిపాలిటీలో 34 వార్డులకు గాను 68 పోలింగ్ కేంద్రాలు, చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులకు గాను 36 పోలింగ్ కేంద్రాలు, క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులకు 45 పోలింగ్ కేంద్రాలు, లక్షెట్టిపేట మున్సిపాలిటీలో 15 వార్డులకు గాను 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఒక బృందానికి 1 పి.ఓ., 1 ఎ.పి.ఓ., 3 ఓ.పి.ఓ. ల చొప్పున రాండమైజేషన్ ప్రక్రియ ద్వారా అధికారుల బృందాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన సర్వీస్ ఓటర్లు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునేలా పోస్టల్ బ్యాలెట్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్లలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని బజార్ ఏరియాలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని చెన్నూర్ పట్టణంలో గల అటవీశాఖ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని సూపర్ బజార్ ఏరియాలో గల ఆర్.కె.సి.ఓ.ఎ. క్లబ్ లో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, లక్షెట్టిపేట మున్సిపల్ పరిధిలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కొరకు జోనల్, నోడల్ అధికారులు, పి.ఓ.లు, ఎ.పి.ఓ.లు, ఓ.పి.ఓ.లు, వీడియో, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందాలు, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెల్, ఇతర ఎన్నికల సంబంధిత సిబ్బందిని నియమించి, అధికారులు, సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థుల తరఫున నియమించబడిన పూర్తి స్థాయి ఏజెంట్ల సమన్వయంతో తప్పుడు ఓట్ల పోలింగ్ ను నివారించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పోలింగ్ రోజున వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు, నీడ ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ సమన్వయంతో భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని,పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల వ్యాసార్థం నిబంధన అమలులో ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, పోటీలో ఉండే అభ్యర్థులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనలు లభించినట్లయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# ఓటు హక్కు వినియోగించుకోండి

## ప్రభుత్వ ఉద్యోగులకు స్పెషల్ సీఎల్ మంజూరు చేసిన కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఫిబ్రవరి 10:**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని ఆలియాబాద్ మూడు చింతలపల్లి ఎల్లంపేట మున్సిపాలిటీలలో ఓటర్లుగా నమోదు అయి ఉన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రత్యేక క్యాజువల్ లీవ్ (Special Casual Leave) మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు.

మున్సిపల్ ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ రోజైన తేదీ 11.2.2026న ఓటు హక్కు కలిగి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రత్యేక క్యాజువల్ లీవ్ మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.ఓటర్లుగా ఉన్న ఉద్యోగులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు

# ఫిబ్రవరి 11వ తారీకున మాజీసైనికుల సమావేశం

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఫిబ్రవరి 10:**మాజీసైనికుల సమస్యల పరిష్కారానికి ఆర్మీ నుండి కొందరు అధికారులు సోమాజీగూడా లోని ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయానికి ఫిబ్రవరి 11వ తారీకున ఉదయం 11గంటలకు విచ్చేయు చున్నారు. ఎవరైనా మాజీసైనికులు పెన్షన్ సమస్యలు లేదా ఇతర సమస్యలు ఉన్నట్లయితే వారు తప్పక హైదరాబాద్ సోమాజీగూడా లోని ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయానికి హాజరై వారి సమస్యలు పరిష్కరించు కోవాలని,మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి,శ్రీనేష్ కుమార్ నోరి తెలిపారు.

## శ్రీశైలం పోతే పుణ్యం తో పాటు లాఠీల “దెబ్బలు

శ్రీశైలం దేవస్థానంలో శివ స్వాముల పై లాఠీలతో దాడి చేసిన పోలీసుల పై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలంలో శివ స్వాముల పై పోలీసుల దాడి వీడియోలు వైరల్ అయ్యాయి. ఆలయ సిబ్బంది నిర్వహణ లోపంతో శ్రీశైలంలో గందరగోళం ఎర్పడింది. ఉదయం నుంచి పడిగాపులు కాస్తున్న భక్తులను గంటల కొద్ది క్యూలో సిబ్బంది నిలిపివేసారు. సిబ్బంది నిర్వహణ లోపంతో ఒక్కసారిగా దర్శనం కోసం భక్తులు ఎగబడ్డారు. దీంతో భక్తులు, శివస్వాములపై పోలీసులు లాఠీలతో విరుచుకుపడ్డారు.

# నేడే వేములవాడ మున్సిపల్ ఎన్నికలు.

## ప్రచారం ముగిసింది, తాయిలాలు పంచడం మొదలైంది. ఖర్చుకు వెనకాడని అభ్యర్థులు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** ఫిబ్రవరి 13వ తేదీ బుధవారం రోజున జరగనున్న వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో ప్రచారం సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. గత పది రోజులుగా పోటీలో ఉన్న అభ్యర్థులు తమ తమ ప్రచారాన్ని వివిధ రూపాలలో నిర్వహించారు. మైకుల మోత, డీజే పాటలు, ర్యాలీలు, కార్నర్ మీటింగులు రాజకీయ నాయకుల ప్రసంగాలు, పది రోజులుగా ప్రజలను హడలగొట్టిన శబ్ద కాలుష్యం సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రశాంతంగా ముగిసింది.

ప్రచారం ముగిసిన సాయంత్రం నుండి ఎన్నికలలో పోటీ చేస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులు ఓటర్లకు తాయిలాలు పంచడం మొదలు పెట్టినారు. బిర్యానీ పొట్లాలు, మహిళలకు కూల్ డ్రింక్స్, చీరలు, మగవారికి మందు, ఇంటింటికి చికెన్, మటన్ కేజీల కొద్దీ పంచడం జరిగింది. వేములవాడ మున్సిపల్ లో మొత్తం 28 వార్డులలో ఒక్కొక్క ఓటరుకు 3000 రూపాయల నుండి 10000 రూపాయల వరకు డబ్బులు విచ్చలవిడిగా పంచడం జరుగుతుంది. పోటీలో నిలిచిన అభ్యర్థులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఒకరికి మించి ఒకరు, ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ గెలిపే లక్ష్యంగా తమకు అనుకూలంగా ఉన్న మార్గాలలో గెలుపును కోరుకుంటున్నారు.

ఎప్పుడూ లేనిది ఈసారి మాత్రం ఓటర్లు ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎప్పుడు వస్తారా, తాయిలాలు ఎప్పుడు ఇస్తారా అని మహిళలు రాత్రంతా ఎదురుచూసిన సందర్భం వేములవాడ పట్టణంలో స్పష్టంగా కనిపించింది.

బుధవారం రోజు జరగనున్న మున్సిపల్ ఎన్నికలలో ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొన్న సందర్భంగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

అధికార కాంగ్రెస్ పార్టీ స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని కాళ్లకు బలపాలు కట్టుకొని వార్డు వార్డుకు, గల్లీ గల్లీకి, ఇంటింటికి తిరిగి తన శ్రేణులతో ప్రచారాన్ని ఉధృతంగా నిర్వహించారు. అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీకే తమ ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించాడు. అభివృద్ధి చేసే కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపిస్తే వేములవాడను వెన్నెల వాడగా చేస్తానని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశాడు.

తెలంగాణ రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని, వేములవాడ పట్టణంలో రోడ్ల వెడల్పు, రాజన్న ఆలయ విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయని కాంగ్రెస్ మంత్రులు, స్థానిక శాసనసభ్యుడు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఓటర్లకు వివరించారు.

ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ పార్టీ 28 వార్డులలో అభ్యర్థులను పోటీలో నిలిపి వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రచారం నిర్వహించారు. ఈసారి కూడా వేములవాడ మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని పట్టుదలతో తీవ్రంగా శ్రమించాడు. బిఆర్ఎస్ పార్టీ హయాంలోనే వేములవాడ అభివృద్ధికి పునాదులు వేసినామని, వేములవాడ పట్టణం చుట్టూ రెండు బైపాస్ రోడ్లు నిర్మించామని, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేశామని, గుడి చెరువు ను 32 ఎకరాలు పూడ్చి రాజన్న భక్తులకు సౌకర్యం కల్పించామని, బద్ది పోచమ్మ ఆలయం చుట్టూ ఉన్న 39 గుంటలలో ప్రైవేట్ ఇండ్లకు నష్టపరిహారం చెల్లించి అట్టి ఇండ్లను కూల్చి బద్దిపోచమ్మ ఆలయాన్ని అభివృద్ధి కొరకు నిధులు మంజూరు బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే చేశామని, గుడి చెరువులో 365 రోజులు నిండా నీరు నిల్వ ఉండే విధంగా మిడ్ మానేరు నుండి ప్రత్యేక పైప్ లైన్ ద్వారా నీటి సరఫరాకు తగిన ఏర్పాట్లు చేయడం జరిగిందని, బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే వేములవాడ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని, కల్లబొల్లి మాటలు చెప్పే ఇతర పార్టీల మాటలు నమ్మొద్దని అభివృద్ధి చేసే పార్టీ అయినా బీఆర్ఎస్ ని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశాడు. బిఆర్ఎస్ పార్టీ పక్షాన ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ప్రస్తుత సిరిసిల్ల శాసనసభ్యుడు కల్వకుంట్ల తారక రామారావు వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద, అమరవీరుల స్తూపం వద్ద, తెలంగాణ తల్లి విగ్రహం చెక్కపల్లి బస్టాండ్ వద్ద కార్నర్ మీటింగ్లో పాల్గొని బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించినాడు. స్థానిక శాసనసభ్యునీ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు. కాంగ్రెస్ పార్టీ రెండు సంవత్సరాలలో మాటలు కోటలు దాటుతున్న, అభివృద్ధి మాత్రం జరగడం లేదని ఆయన ఎద్దేవా చేశాడు. అభివృద్ధి అంటే బిఆర్ఎస్, బిఆర్ఎస్ అంటేనే అభివృద్ధి అని ఆయన పేర్కొన్నాడు.

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గానీ, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గాని నేటి వరకు తెలంగాణ అభివృద్ధికి గానీ, వేములవాడ పట్టణ అభివృద్ధికి గానీ, రాజన్న ఆలయానికి గాని ఒక్క రూపాయి కూడా తేలేదు అని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అభివృద్ధి చేయని పార్టీలకు ఈ ఎన్నికలలో వేములవాడ పట్టణ ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పేర్కొన్నారు.

వేములవాడ బిజెపి పార్టీలో ఎడ మొఖం, పెడ ముఖం ఉన్న నాయకులు ఎన్నికల సమయంలో కలిసి పనిచేయడం జరిగింది. స్థానిక బిజెపి నాయకుడు మాజీ సిరిసిల్ల అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, వేములవాడ నియోజకవర్గ బిజెపి పార్టీ ఇంచార్జ్ చెన్నమనేని వికాస్ రావు, వికాస్ రావు భార్య దీప, కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వివిధ సందర్భాలలో వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో తీవ్రస్థాయిలో ప్రచారం నిర్వహించినారు. బిజెపి పార్టీని వేములవాడ మున్సిపల్ ఎన్నికలలో అధికారం అప్పగిస్తే కేంద్రం నుండి నిధుల వరదను పారిస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రి మాటలు వేములవాడ పట్టణ ప్రజలు నమ్మిన దాఖలాలు కనబడడం లేదు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాజన్న ఆలయానికి వచ్చి రాజన్నను దర్శించుకొని వెళ్లిన ప్రధానమంత్రి నేటికీ రాజన్న ఆలయానికి ఒక రూపాయి కూడా నిధులు మంజూరు చేయలేదని వేములవాడ పట్టణ ప్రజలు బాటంగా చర్చించుకుంటున్నారు.

ఏది ఏమైనా బుధవారం రోజున వేములవాడ మున్సిపల్ లో జరగనున్న ఎన్నికలలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో ఏ పార్టీ ఓడిపోతుందో 13వ తేదీ వరకు వేచి ఉండవలసిన అవసరం ఉంది. ప్రచారం ముగిసిన వెంటనే ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులకు గెలుపు ఓటముల భయం పట్టుకుంది. వేములవాడ పట్టణంలో ఎక్కడ నలుగురు కలిసిన ఎవరు ఓడుతారు, ఎవరు గెలుస్తారు అనే చర్చ తీవ్ర స్థాయిలో జరుగుతున్నది. మరి కొంతమంది పలానా పార్టీ మున్సిపల్ ని కైవసం చేసుకుంటుందని బెట్టింగులు కాస్తున్నారు.

## సంగారెడ్డి జిల్లాలో పోలింగ్‌కు సర్వం సిద్ధం...

## జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో పోలింగ్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 10(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి,ఓటర్లు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని స్థాయిల్లో ఏర్పాట్లు చేపట్టారు,ఈ ఎన్నికలు సంగారెడ్డి,సదాశివపేట, కోహిర్, జహీరాబాద్, నారాయణఖేడ్, జిన్నారం, ఆందోల్--జోగిపేట్, ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలలో జరగనున్నాయి,జిల్లాలోని 11 మున్సిపాలిటీల్లో మొత్తం 256 వార్డులు ఉండగా, వాటికి గాను 541 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు,ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసారు,మొత్తం 3,41,808 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొననున్నారు,వారిలో పురుషులు -- 1,71,151,మహిళలు -- 1,70,638,ఇతరులు -- 19, మున్సిపాలిటీ వారీగా ఓటర్ల వివరాలు,ఆందోల్--జోగిపేట్ : 20 వార్డులు, 32 పోలింగ్ కేంద్రాలు 16,450 మంది ఓటర్లు,గడ్డపోతారం : 18 వార్డులు 18 పోలింగ్ కేంద్రాలు 11,983 ఓటర్లు,గుమ్మడిదల :22 వార్డులు 44 పోలింగ్ కేంద్రాలు 23,926 ఓటర్లు,ఇంద్రేశం :18 వార్డులు 19 పోలింగ్ కేంద్రాలు 13,086 ఓటర్లు,ఇస్నాపూర్ : 26 వార్డులు 60 పోలింగ్ కేంద్రాలు 35,912 ఓటర్లు,జిన్నారం : 20 వార్డులు 22 పోలింగ్ కేంద్రాలు 12,473 ఓటర్లు,కోహిర్ : 16 వార్డులు 16 పోలింగ్ కేంద్రాలు 10,832 ఓటర్లు,నారాయణఖేడ్ :15 వార్డులు, 30 పోలింగ్ కేంద్రాలు 17,675 ఓటర్లు,సదాశివపేట : 26 వార్డులు, 58 పోలింగ్ కేంద్రాలు 36,982 ఓటర్లు,సంగారెడ్డి : 38 వార్డులు, 121 పోలింగ్ కేంద్రాలు 83,668 ఓటర్లు,జహీరాబాద్ : 37 వార్డులు 121 పోలింగ్ కేంద్రాలు 78,819 ఓటర్లు,పోలింగ్ నిర్వహణ కోసం జిల్లాలో 103 మంది రిటర్నింగ్ అధికారులు,103 మంది అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు,649 మంది ప్రిసైడింగ్ అధికారులు,649 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు,1,948 మంది ఇతర పోలింగ్ అధికారులు,73 మంది మైక్రో అబ్జర్వర్లు , 49 మంది జోనల్ ఆఫీసర్లను నియమించారు,ప్రశాంతంగా, సురక్షితంగా పోలింగ్ జరిగేలా శాంతిభద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

## వికారాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్లు 25 పైన ఘనవిజయం పక్క

## మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గారి కొండల్ రెడ్డి

## వికారాబాద్ ప్రచారంలో మర్పల్లి దే జోరు



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఫిబ్రవరి 10 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** వికారాబాద్ మున్సిపాలిటీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనా గారి కొండల్ రెడ్డి వికారాబాద్ మున్సిపాలిటీలో 25 కి పైగా కౌన్సిలర్లు ఘన విజయం సాధిస్తారని వికారాబాద్ లో చైర్మన్ గడ్డం ప్రసాద్ కుమార్ కుమార్తె గడ్డం అనన్య చైర్మన్గా వికారాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా పక్క ఘనవిజయం సాధిస్తుందని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టరేట్ అవార్డు గ్రహీత సనా గారి కొండల్ రెడ్డి తెలిపారు ప్రచార కార్యక్రమంలో పెద్ద ఎత్తున పెద్దలు సీనియర్ నాయకులు కార్యకర్తలు మర్పల్లి మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున వికారాబాద్ పట్టణంలో ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు తెలిపారు



## ఫిబ్రవరి 13 నుండి 15వ తేదీ వరకు తరిగొండ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ సంప్రోక్షణ మహోత్సవాలు

అన్నమయ్య గుర్రంకొండ మండలం, తరిగొండలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ సంప్రోక్షణ మహోత్సవాలు ఫిబ్రవరి 13 నుండి 15వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు వేద మంత్రోచ్చారణల నడుమ వైదిక కార్యక్రమాలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 12న జ్యేష్ఠ నక్షత్రంలో సాయంత్రం అంకురార్పణతో నూతన ధ్వజ స్తంభ సంప్రోక్షణ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా అఖండ దీపారాధన, భగవత్ ప్రార్థన , అంకురార్పణ, ధాన్యాధివాసం కార్యక్రమాలు నిర్వహిస్తారు.ఫిబ్రవరి 13వ తేదీన చతుస్థానార్చన, హోమం, జలాధివాసం, క్షీరాధివాసం తదితర వైదిక కార్యక్రమాలను చేపడుతారు. ఫిబ్రవరి 14వ తేదీనచతుస్థానార్చన, ఛాయాధివాసం, పంచశయాధివాసం, లఘు పూర్ణాహుతి జరుగనుంది. ఫిబ్రవరి 15వ తేదీన త్రయోదశి, ఉత్తరాషాడ నక్షత్రయుక్త కుంభ లగ్నపుష్కరాంశయందు ఉదయం 08.16 గం.లకు ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం చేపడుతారు. అనంతరం కుంభ ఉద్వాసనం, బింబ ఉద్వాసనం, మహా సంప్రోక్షణ, కుంభలగ్నం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. మహా నివేదన, బలిహారణ, మంగళ శాసన, శాత్తుమొర తీర్థ ప్రసాద గోష్ఠి విద్వత్ సంభావనం చేపడుతారు. ఈ మహోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని టిటిడి కోరుతోంది.

## శివ స్వాములు భక్తులు

## ఓం నమశ్శివాయ అంటూ శ్రీశైలానికి

గోనెగండ్ల ఫిబ్రవరి 10 గోనెగండ్ల మండలంలోని గ్రామాలలో శివమాల ధరించిన శివ స్వాములు మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో శ్రీశైలానికి బయలుదేరి వెళ్ళారు మండలంలోని మండల పరిధిలో గ్రామాలలోని ప్రతి గ్రామంలో శివాలయం ఉన్నచోట శివ స్వాములు వానాధారం చేసి 41 రోజు దీక్ష పాటించి ఆ శివుని అనుగ్రహం కోసం ఆ పార్వతీ మాత ఆశీస్సుల కోసం ఓం నమశ్శివాయ ఓం నమశ్శివాయ హర హర మహాదేవ అంటూ శ్రీశైలానికి బయలుదేరి వెళ్ళారు సర్వజనులకు ఆ శివయ్య కృప కటాక్షం అందరి పైన ఉండాలని శివ స్వాముల కోరిక

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com